

నడిరోడ్డుపై జగన్ షో!

పోలీసుల సూచనలు పట్టించుకోని మాజీ సీఎం

అడుగడుగునా ట్రాఫిక్ ఇక్కట్లు

- ఆయన ఎప్పుడు నగరానికి వచ్చినా ఇదే పరిస్థితి



గోపాలపట్నం ప్రాంతంలో జగన్ రోడ్‌షో... పక్కన సర్వీస్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

- నాడు స్టీల్‌ప్లాంటును గాలికి వదిలేసి... నేడు మొసలికన్నీరు
- గోపాలపట్నంలో అంబులెన్స్‌కు కూడా దారి ఇవ్వని వైసీపీ శ్రేణులు

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన నగర వాసులకు చుక్కలు చూపించింది. ఎయిర్‌పోర్టు నుంచి ఎన్ఏడీ, పెందుర్తి మీదుగా జగన్ కాన్వాయ్‌కు పోలీసులు అనుమతించి, షరతులు విధించినా ఎక్కడికక్కడ శ్రేణులకు అభివాదం చేసేందుకు కాన్వాయ్‌ను రోడ్డుపై నిలిపివేయడంతో వాహన రాకపోలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

జగన్ ఎప్పుడు నగరానికి వచ్చిన ట్రాఫిక్ సమస్య షరా మామూలే. సీఎం హోదాలో జరిపిన పర్యటనల్లో రోడ్డుకు ఇరువైపులా పరదాలు కట్టి అధికార దర్పాన్ని ప్రదర్శించేవారు. సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ఎవరినీ రోడ్డుపైకి రాకుండా పోలీసులు కట్టుదిట్టంగా బందోబస్తు నిర్వహించేవారు. జగన్ రావడానికి కనీసం గంట ముందు నుంచే వాహన రాకపోకలను నిలిపివేసేవారు. సీఎం హోదాలో చినముషిడివాడలోని శారదాపీఠం వార్షికోత్సవానికి వచ్చినప్పుడు ఎయిర్‌పోర్టు నుంచి పెందుర్తి వరకు గంటల తరబడి రోడ్డు బ్లాక్ చేశారు. దీంతో ఎయిర్‌పోర్టుకు వెళ్లాల్సినవారు, నగరంలోకి రావాల్సిన వారు లగేజీలతో ఈసురోమంటూ కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తినా ఆ తర్వాత పర్యటనల్లోనూ పరిస్థితిలో మార్పు రాలేదు. గురువారం అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మెడికల్ కాలేజీని సందర్శించేందుకు నగరానికి వచ్చిన జగన్ పర్యటన అడుగడుగునా ట్రాఫిక్ ఇక్కట్లను సృష్టించింది. నగరంలో గురువారం అంతర్జాతీయ మహిళల క్రికెట్ వరల్డ్‌కప్ మ్యాచ్ జరుగుతుండడంతో పోలీసులు జగన్ రోడ్డు మార్గంలో వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు. హెలికాప్టర్‌లో వెళ్లే అంశాన్ని పరిశీలించాలని ... మిగతా 6వ పేజీలో

వీఎంఆర్‌డీఏ కమిషనర్ బదిలీ



- ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా విశ్వనాథన్ నియామకం
- కలెక్టర్‌కు వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌కు విజయవాడ బదిలీ అయింది. రాష్ట్ర ప్రభుత్వం గురువారం పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా విశ్వనాథన్‌ను ఇన్‌ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ శాఖ డైరెక్టర్‌గా నియమించింది. దీంతో పాటు సాధారణ పరిపాలన ఎక్స్ అఫీషియో డిప్యూటీ సెక్రటరీ బాధ్యతలను కూడా అప్పగించింది. విశ్వనాథన్ మూడేళ్ల క్రితం జాయింట్ కలెక్టర్‌గా విశాఖపట్నంలో బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత జీవీఎంసీలో అదనపు కమిషనర్‌గా కొన్ని నెలలు పనిచేశారు. ఏడాదిన్నర క్రితం వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా నియమితులయ్యారు. పనిచేసిన ప్రతి చోటా తనదైన ముద్ర వేశారు.

నిజాయితీ గల అధికారిగా...

విశ్వనాథన్ నిజాయితీ గల అధికారిగా గుర్తింపు పొందారు. వీఎంఆర్‌డీఏలో ప్రాజెక్టులను పరుగులు పెట్టించారు. సిరిపురంలో 'ది డెక్' నిర్మాణం పూర్తిచేయడంతో పాటు దానిని ప్రముఖ సంస్థలకు అప్పగించడంలో కీలకంగా వ్యవహరించారు. కైలాసగిరిపై జిప్‌లైనర్, స్కై సైక్లింగ్‌తో పాటు గ్లాస్ బ్రిడ్జిని అందుబాటులోకి ... మిగతా 6వ పేజీలో

రిచా ఘోష్ మెరుపు ఇన్నింగ్స్

బ్యాటుతో ఆకట్టుకున్న భారత వికెట్ కీపర్

..అయినా దక్కని విజయం

ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలుపు

వీరోచిత బ్యాటింగ్‌తో అదరగొట్టిన డీ క్లెర్క్



విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

భారత వికెట్ కీపర్ రిచా ఘోష్, దక్షిణాఫ్రికా బ్యాటర్ డీ క్లెర్క్ బ్యాటింగ్ మెరుపులతో ఏసీఏ-వీడీసీఏ స్టేడియం హోరెత్తింది. వన్డే మ్యాచ్ కాస్త టీ20 మాదిరిగా సాగింది. అయితే ఆతిథ్య జట్టు ఓటమి పాలుకావడం అభిమానులను నిరాశకు గురిచేసింది.

మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా గురువారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ మూడు వికెట్ల తేడాతో ఓటమి చెందింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.5 ఓవర్లలో 251 పరుగులు చేసింది. ఓపెనర్లు ప్రతికా రావల్ (37), స్మృతి మంధానా (23) శుభారంభం ఇచ్చినా మిడిల్ ఆర్డర్ ఘోరంగా విఫలమైంది. హర్లీన్ డియోల్ (13), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (9) సహా పలువురు తక్కువ స్కోరుకే అవుటయ్యారు.

రెచ్చిపోయిన రిచా ఘోష్

టాప్ ఆర్డర్ పెవిలియన్ దారిపట్టిన సమయంలో ఎనిమిదో స్థానంలో క్రీజులోకి వచ్చిన రిచా ఘోష్ రెచ్చిపోయి దక్షిణాఫ్రికా బౌలర్ల భరతం పట్టింది. 150 పరుగులు చేయడమే కష్టమనుకున్న సమయంలో రిచా ... మిగతా 6వ పేజీలో

రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.553.22 కోట్లు

- లక్ష్యంలో 81.15 శాతం సాధన
- తొలి ఆరు నెలలు ఆశాజనకం
- ఫలించిన అధికారుల చర్యలు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రిజిస్ట్రేషన్ల శాఖ మెరుగైన ఆదాయం సాధించింది. రియల్ ఎస్టేట్ లావాదేవీలు పెద్దగా లేకపోయినప్పటికీ 81.15 శాతం లక్ష్యాన్ని సాధించింది. గత ఏడాది కంటే 11.26 శాతం వృద్ధి నమోదు చేసింది.

విశాఖ జిల్లాలో తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటి ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్ నుంచి సెప్టెంబరు నెలాఖరు ... మిగతా 6వ పేజీలో

కార్యాలయాల వారీగా ఆదాయం వివరాలు

కార్యాలయం	లక్ష్యం	ఆదాయం
భీమునిపట్నం	రూ.40.25 కోట్లు	రూ.35.43 కోట్లు
సూపర్‌బజారు	రూ.166.39 కోట్లు	రూ.125.26 కోట్లు
గాజువాక	రూ.65.83 కోట్లు	రూ. 68.47 కోట్లు
గోపాలపట్నం	రూ.34.96 కోట్లు	రూ. 21.43 కోట్లు
ద్వారకానగర్	రూ.71.46 కోట్లు	రూ.50.12 కోట్లు
మధురవాడ	రూ.157.77 కోట్లు	రూ.143.97 కోట్లు
ఆనందపురం	రూ. 39.31 కోట్లు	రూ. 33.78 కోట్లు
పెదగంట్యాడ	రూ. 57.38 కోట్లు	రూ.36.61 కోట్లు
పెందుర్తి	రూ. 48.41 కోట్లు	రూ. 38.12 కోట్లు


ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి

ఏ పని చెప్పినా చేయాల్సిందేనంటున్న స్టీల్‌ప్లాంటు యాజమాన్యం

- సెక్షన్ ఇన్‌చార్జి ఆదేశాలు పాటించాలని హుకుం
- ట్యాపింగ్, చార్జింగ్, కన్వర్టర్ ఆపరేషన్ బాధ్యతలు
- పని ఒత్తిడితో సతమతం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఏ బరువు వేసినా మోయాల్సిందే... అన్నట్టుగా స్టీల్‌ప్లాంటు యాజమాన్యం వ్యవహరిస్తోంది. స్టీల్‌ప్లాంటు వంటి సాంకేతిక కర్మాగారాల్లో అనేక రకాల నిపుణులు వేర్వేరు పనులు చేస్తుంటారు. కానీ తాజాగా ఎవరు ఏ పనైనా చేయాలని యాజమాన్యం నిర్దేశించింది. అత్యధిక ఉత్పత్తి సాధించడమే లక్ష్యమని, దానికి తగ్గట్టు పనిచేయాలని ఒత్తిడి పెడుతోంది. సెక్షన్ ఇన్‌చార్జి ఏ బాధ్యత అప్పగించినా చేయాల్సిందేనంటూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని తొలుత స్టీల్‌మెల్టింగ్ షాప్-2లో అమలుచేయాలని ఆదేశించింది.



రోజుకు 19 వేల టన్నులకుపైగా ఉక్కు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నందున.. దానికి తగ్గట్టుగా పనితీరు మెరుగుపడాలని, అందుకే ఈ ఆదేశాలు ఇస్తున్నట్టు ఉక్కు యాజమాన్యం ఉత్తర్వుల్లో పేర్కొంది. కన్వర్టర్ ఆపరేషన్లు, క్రేన్ ఆపరేషన్లు చేపట్టే సమయంలో ఉద్యోగులు అన్నిరకాల పనులు చేయాలని సూచించింది. విభాగంలో సీనియర్ మోస్ట్ ఉద్యోగులు ట్యాపింగ్, చార్జింగ్, కన్వర్టర్ ఆపరేషన్ చేయాలనే నిబంధన పెట్టారు. ఒక షిఫ్ట్‌లో ఉండే చార్జ్‌మెన్లు, మాస్టర్, సీనియర్ టెక్నీషియన్లు టీమ్‌గా ఏర్పడి షిఫ్ట్ ఇన్‌చార్జి చెప్పినట్టు వినాలని ఉక్కు అధికారులు పేర్కొన్నారు. మానవ వనరులు తక్కువగా ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్పత్తి తగ్గకూడదని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

అనుభవం లేని చోట పనులు

ఎస్ఎంఎస్‌లో ట్యాపింగ్, చార్జింగ్, కన్వర్టర్ ఆపరేషన్ వేర్వేరు పనులు. వేల డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద జరుగుతాయి. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తాయి. బ్లాస్ట్ ఫర్నేసుల్లో కుతకుత మరుగుతున్న లిక్విడ్ స్టీల్‌ని ల్యాడిల్ ద్వారా బయటకు తీయడాన్ని ట్యాపింగ్‌గా వ్యవహరిస్తారు. ఇక్కడ సమయం అత్యంత కీలకం. ఈ ప్రక్రియ అంతా 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో పూర్తిచేస్తారు. లిక్విడ్ స్టీల్ (ఇనుము)ను పూర్తిస్థాయి స్టీల్ (ఉక్కు)గా మార్చడానికి కొన్నిరకాల ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

- ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ నిర్ణయం
- ఆరు నెలలుగా పేరుకుపోయిన బిల్లులు
- సుమారు రూ.150 కోట్ల మేర బకాయిలు
- 65 ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలపై ప్రభావం

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ లను నిలిపివేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యా లు నిర్ణయించాయి. గత ఆరు నెలలుగా ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) ప్రకటించింది. ఇప్పటికే వివిధ మార్గాలద్వారా ప్రభుత్వానికి తమ ఇబ్బందులను తెలియపరిచినప్పటికీ ప్రయోజనం కనిపించలేదని ఆషా ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేయడంతో జిల్లాలోని 65 ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో రోగులకు వైద్యసేవలు నిలిచిపోనున్నాయి. అయితే ఇప్పటికే వైద్యసేవలు పొందుతున్న రోగులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద జిల్లాలో ప్రతిరోజూ సుమారు 500 నుంచి 600 మంది రోగులకు శస్త్ర చికిత్స లు, ఇతర వైద్యసేవలను అందిస్తున్నారు. తాజా నిర్ణ యంతో ప్రతిరోజూ సుమారు 400 మందికి ఇబ్బందులు ఎదురవనున్నాయి. అయితే ఇప్పటికే కేన్సర్, కిడ్నీ తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు ... మిగతా 6వ పేజీలో

అగనంపూడిలో దోపిడీ

- వృద్ధురాలిని కత్తితో బెదిరించి ఆరు తులాల బంగారం చోరీ

అగనంపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

అగనంపూడి జాబిలిహిల్స్‌లో పట్టపగలే దోపిడీ జరిగింది. ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గుర్తుతెలియని దుండగుడు కత్తితో బెదిరించి ఆమె ఒంటిపై ఉన్న సుమారు ఆరు తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. బుధవారం సాయంత్రం ఈ సంఘటనకు సంబంధించి సౌత్ క్రైమ్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలావున్నాయి.

జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శివారు శనివాడ జాబిలిహిల్స్ రెండో లైన్‌లో గల రెండు అంతస్థుల ఇంట్లో ఇద్దరు కుమార్తెలతో కలిసి కె.అమ్మన్న (77) నివాసముంటోంది. బుధవారం మధ్యాహ్నం 3.50 గంటలకు కుటుంబ సభ్యులంతా షాపింగ్ నిమిత్తం గాజువాక వెళ్లారు. మనవడు సుమంత్ కింద ఇంట్లో టీవీ చుస్తూ నిద్రపోయాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పైఅంతస్థులో ఉన్న అమ్మన్న దగ్గరికి వెళ్లాడు. కత్తితో బెదించి ఆమె ఒంటిపై ఉన్న సుమారు ఆరు తులాల బంగారు చైను, గాజులు, ఉంగరం, చెవి దిద్దులు ... మిగతా 6వ పేజీలో



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ శ్రీనివాసరావు

అడవివరంలో రైడెన్ డేటా సెంటర్

సింహాచలం దేవస్థానానికి చెందిన 100 ఎకరాలు గుర్తింపు

విశాఖపట్నం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి):

సింహాచలం దేవస్థానానికి చెందిన అడవివరం కొండవాలు ప్రాంతంలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నది. ఇందుకోసం అడవివరంలో సెంట్రల్ జైలు, శ్రీకృష్ణాపురం గురుకులానికి ఆనుకుని దేవస్థానానికి చెందిన 100 ఎకరాలను గుర్తించారు. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా గూగుల్ అనుబంధ సంస్థ నగరంలోని అడవివరం, ఆనందపురం మండలం తర్లువాడ, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో సెంటర్లు ఏర్పాటుచేస్తోంది. సముద్రానికి అతి చేరువలోనే భూమి కేటాయించాలని గూగుల్ సంస్థ కోరింది. ప్రభుత్వం ఈ మేరకు జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీచేసింది. తర్లువాడలో భూముల సేకరణకు ఇప్పటికే చాలా సమావేశాలు నిర్వహించారు. అడవివరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన కొండవద్ద 100 ఎకరాల్లో క్యాంపస్ ఏర్పాటు చేస్తారు. ఈ భూములు దేవస్థానానికి చెందినవి కావడంతో ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి కేటాయించేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.



రైడెన్ సంస్థకు కేటాయించనున్న అడవివరం కొండవాలు



గోపవరంలో ముత్తంశెట్టి నిర్మించిన కల్యాణ మండపం

రూ. కోటితో కల్యాణ మండపం

- స్వగ్రామంలో నిర్మించిన మాజీ మంత్రి ముత్తంశెట్టి

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : తన స్వగ్రామం కృష్ణా జిల్లా ముసునూరు మండలంలోని గోపవరంలో సొంత నిధులు కోటి రూపాయలతో కల్యాణ మండపం నిర్మించినట్టు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. తాను పుట్టి పెరిగిన గ్రామానికి ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో ప్రజలకు అవసరమైన కల్యాణ మండపం నిర్మించానన్నారు. బుధవారం మండపాన్ని ప్రారంభించానని, ప్రజలు దీన్ని ఉచితంగా వినియోగించుకోవచ్చునని చెప్పారు.గతంలో గ్రామంలో 3 ఎకరాలు కొనుగోలు చేసి కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం, బస్ షెల్టర్ నిర్మించానన్నారు. అలాగే ఆసుపత్రి నిర్మాణానికి స్థలం కొనుగోలు చేశానని తెలిపారు.

స్వీట్స్ తయారీ కేంద్రంపై ఫిర్యాదు



ఆర్‌టీసీ కాంప్లెక్సు స్థలంలో మడుగు మాదిరి ఉన్న మురుగునీరు

తగరపువలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : బైపాస్ రోడ్డు వద్ద ఉన్న స్వీట్స్ తయారీ కేంద్రం నిర్వాహకులు వ్యర్థాలు, మురుగు నీటిని ఆర్‌టీసీ కాంప్లెక్సు కోసం కేటాయించిన స్థలంలోకి విడిచిపెడుతున్నారని బంగ్లామెట్ట పరిసర ప్రాంత ప్రజలు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈమేరకు జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మీనాయుడు గురువారం కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఆర్‌టీసీ కాంప్లెక్సు నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని చూసి, కేంద్రం నుంచి మురుగు నీరు వెళ్తున్న విషయాన్ని గుర్తించారు. నిర్వాహకులకు నోటీసులు అందజేస్తామని చెప్పారు.

భోజన పథకం నిర్వాహకురాలి నిరసన

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజ్జివలస ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు రాంబాయి గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో కొన్నేళ్ల నుంచి పని చేస్తున్న తనను అన్యాయంగా విధుల నుంచి తొలగించారని చెప్పారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడానికి విద్యా కమిటీ చైర్మన్ గుడ్లాల గురునాథరావు, ఇతర నాయకులు కుట్ర పన్నారని ఆరోపించారు. ఇందులో విద్యా శాఖాధికారుల పాత్ర కూడా ఉందన్నారు. ఈమేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు నిరసన చేపట్టారు. కాగా ఈవిషయమై ఎంఈఓ శివరాణి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఈశ్వరమ్మను భోజన పథకం నిర్వాహకురాలిగా నియమిస్తూ విద్యా కమిటీ నెల రోజుల క్రితమే తీర్మానం చేసిందన్నారు. ఈశ్వరమ్మ కుమార్తె కూడా పాఠశాలలో చదువుతుందని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఆమెకే అవకాశం ఉందని చెప్పారు.

కార్మికులంతా స్ప్రీ పథకంలో చేరాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్యామ్ ప్రసాద్

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈఎస్ఐ కార్పొరేషన్ తరఫున కొత్తగా ప్రారంభిస్తున్న స్ప్రీ (ఎస్‌పీఆర్ఈఈ) 2025 పథకంలో అన్ని కర్మాగారాల్లో పని చేస్తున్న కార్మికులు విధిగా చేరాలని కార్మిక బీమా సంస్థ సహాయ సంచాలకుడు వేమూరి శ్యామ్ ప్రసాద్ కోరారు. గురువారం ఆయన దివీస్ కార్మికులకు స్ప్రీ పథకం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కీమ్ ఫర్ ప్రమోట్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్ పథకాన్ని కేంద్రం కొత్తగా తీసుకువచ్చిందన్నారు. ఇందులో నమోదైన వారికి మాత్రమే ఈఎస్ఐ వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దివీస్ జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎంఎస్ఎన్ రావు, ఈఎస్ఐ మేనేజర్ అజీజ్ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో దోపిడీ

... 5వ పేజీ తరువాయి

దోచుకుని వెళ్లిపోయాడు. తేరుకున్న అమ్మన్న కేకలు వేయడంతో మనవడు సుమంత్ పరుగున రెండో అంతస్థుకు చేరుకునే సరికి దుండగుడు ఉడాయించాడు. అమ్మన్న కుమార్తె శ్రావణి దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. స్థానికులే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రిచా ఘోష్ మెరుపు ఇన్నింగ్స్

... 5వ పేజీ తరువాయి

ఘోష్ బౌండరీలు, సిక్సర్లతో చెలరేగి స్కోరు బోర్డును పరిగెత్తించింది. ఎదుర్కొన్న తొలి బంతి నుంచి సఫారీ బౌలర్లపై దాడికి దిగింది. దక్షిణాఫ్రికా సారథి లౌరా ఎప్పటికప్పుడు బౌలర్లను మార్చినా రిచాను నిలువరించడంలో సఫలం కాలేదు. ప్రతి ఓవర్‌లో కనీసం ఒక బౌండరీ బాది భారత్ శిబిరానికి ఉత్సాహానిచ్చింది. 43.5వ ఓవర్‌లో డి క్లెర్క్ బౌలింగ్‌లో సింగిల్ తీసి 53 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో అర్థ సెంచరీతో (50) పూర్తిచేసింది. రిచాకు స్నేహ రానా తోడైంది. ఇద్దరూ కలిసి సఫారీ బౌలర్లకు చుక్కలు చూపారు. కేవలం 36 బంతుల్లో 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అర్థ సెంచరీ తర్వాత మరింత మరింత రెచ్చిపోయిన రిచా ఘోష్ 46 ఓవర్లలో ఖాకా బౌలింగ్‌లో రెండు బౌండరీలు, ఇక సిక్సర్ బాదింది. భారత్ స్కోరు 251 చేరడానికి రిచా ఘోష్‌కు స్నేహ రానా అద్భుతమైన తోడ్పాటునిచ్చింది.రిచాతోపాటు రానా కూడా బంతులను బౌండరీలకు తరలిస్తూ సఫారీ బౌలర్లకు చెమటలు పట్టించింది. 42 ఓవర్‌లో మ్లాబా బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టింది. మరోవైపు రిచా ఘోష్ సెంచరీకి చేరువవుతున్న సమయంలో ప్రేక్షకులలో ఉత్కంఠ నెలకొంది. వ్యక్తిగత స్కోరు 94 పరుగుల వద్ద అవుటైన రిచాను ప్రేక్షకులు నిలబడి హర్షధ్వానాలతో అభినందనలు తెలపడం ఆకట్టుకున్నది. లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా హాఫ్ సెంచరీతో (70) రాణించగా 81 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన దశలో బ్యాటింగ్‌కు దిగిన డీ క్లెర్క్ 54 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో (84 నాటౌట్) చెలరేగింది. 47 ఓవర్లో క్రాంతి గౌడ్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు, ఒక బౌండరీ బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. 49వ ఓవర్లో అమన్‌జోత్ కౌర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాది విజయానికి అవసరమైన 12 పరుగులను సాధించి అనూహ్య విజయాన్నందించింది.



ప్రజలు తాగునీరు పట్టుకునే కుండీ



మురుగుతో నిండి ఉన్న కాలువ



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు

పారిశుధ్య లోపం వల్లే అతిసార

- కొయ్యపేటలో అధ్వాన పరిస్థితులు
- వీధుల్లో పేరుకుపోయిన చెత్త
- పూడికలతో కాలువలు
- పట్టించుకోని అధికారులు

పద్మనాభం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ కొయ్యపేటలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గ్రామంలో ఎక్కడ చూసినా.. చెత్త పేరుకుపోయింది. మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. నెలలు తరబడి కాలువల్లో పూడికలు తొలగించలేదు. ముఖ్యంగా తాగునీటి సరఫరాకు సరైన పైపులైన్ లేదు. భూమిలో గొయ్యి తీసి అందులో కుండీ కట్టుకొని నీరు నింపి తోడుకుంటున్నారు. దీనివల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. కొళాయిలు పని చేయకపోవడంతో కుండీల్లో నీటిని పట్టుకొని వినియోగిస్తున్నారు. గ్రామంలో శిథిలమైన వాటర్ ట్యాంకు కూడా ఉంది. దాన్ని కూడా నిత్య వాడకాలకు వినియోగిస్తున్నారు. అక్కడ మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. కాగా గ్రామంలో 20 మంది వరకు అతిసార బారిన పడడంతో జిల్లా పంచాయతీ అధికారి ఎంవీపీ శ్రీనివాసరావు గురువారం ఆ గ్రామాన్ని సందర్శించారు. పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. తక్షణమే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రేవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నడుస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రోగుల వివరాలు, ఇస్తున్న మందుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కుండీల ద్వారా వాడుతున్న నీటిని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ లేబొరేటరీకి పంపించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

పద్మనాభం రూరల్ : సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ జగదీశ్వరరావు సూచించారు. గురువారం ఆయన నేరేళ్లవలస పంచాయతీలోని కొయ్యపేటలో అతిసార బాధితులను పరామర్శించారు. అతిసార ప్రబలడానికి గల కారణాలను అధికారులను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో రూపేశ్ కూడా గ్రామాన్ని సందర్శించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గర్భిణిలు పోషకాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన 8వ రాష్ట్రీయ పోషక మాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గర్భిణిలకు అవసరమైన పోషకాలను శాస్త్రీయంగా ఎంపిక చేసి, అందజేస్తుందని చెప్పారు. గత నెల 17 నుంచి ఈనెల 16వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని గర్భిణిలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది ఆరోగ్యంపై ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కోట్లాది రూపాయల సంక్షేమ, అభివృద్ధి పనుల కంటే ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఎక్కువ ఆనందం ఇస్తుందని తెలిపారు. అనంతరం గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ శ్రీదేవి, తహశీల్దార్ శ్రీనుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, కార్పొరేటర్లు నరసింహం, లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, బీఆర్‌టీ నాయుడు, తమ్మిన అప్పలరాజు, శాఖరి శ్రీనివాస్,బమ్మిడి ఉమ, కర్రి శ్రీనివాసరావు, గంధ్రెడ్డి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

వరి కోతల అనంతరం భూముల రీసర్వే

పాండ్రంగి గ్రామ సభలో రైతుల తీర్మానం

పద్మనాభం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూముల్లో వరి పంట ఉండడం వల్ల పాండ్రంగిలో భూముల రీసర్వేకు సహకరించలేమని రైతులు స్పష్టం చేశారు. గురువారం ఆ గ్రామంలో జరిగిన సభలో తీర్మానం చేసి, టీడీపీ సీనియర్ నాయకుడు రామరాజు సమక్షంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ద్వారా నివేదించారు. రెవెన్యూ సిబ్బంది గ్రామంలో భూముల రీసర్వేపై సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ పొలాల్లో వరి పంట పక్వానికి వచ్చే దశలో ఉందని, ఈ సమయంలో రీసర్వే చేస్తే పంట నాశనమవుతుందన్నారు. కోతలు అయిన తరువాత రీసర్వే చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, సర్వేయర్ రామకృష్ణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, జనసేన నాయకులు వెన్ని బంగారునాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు రామరాజు, టీడీపీ మండల కార్యదర్శి మహంతి అప్పలరమణ (శ్రీనివాసరావు), ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బి. సంతోషి, వెంకటరావు, కామరాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.



పాండ్రంగి సభలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

పారదర్శకంగా భూముల రీసర్వే

పద్మనాభం రూరల్ : మండలంలో భూముల రీసర్వేను పారదర్శకంగా చేపడుతున్నట్టు రీసర్వే డీటీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన పొట్నూరు గ్రామ రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సమక్షంలో పొలం సరిహద్దు రాళ్లు, డాక్యుమెంట్ల పరిశీలన చేపట్టి, రీసర్వే చేస్తామని చెప్పారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.రీసర్వేకు వచ్చిన వారు భూముల రికార్డులు తీసుకురావాలని సూచించారు.

ఇస్కాన్‌లో దామోదర మాసోత్సవాలు

సాగర్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో కార్తీక దామోదర మాసోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమైనట్టు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాసు తెలిపారు. ఉత్సవాలు వచ్చే నెల 5వ తేదీ వరకు జరుగుతాయని, మాతాజీ నితాయి సేవని ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉదయం నాలుగున్నర నుంచి ఆరు గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. మంగళ హారతి, తులసీ హారతి, భగవంతునికి నేతి దీపం సమర్పణ, భగవద్గీత 12వ అధ్యాయనం, శిక్షాష్టకం పారాయణం జరుగుతాయని చెప్పారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

భీమునిపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించి, ఉన్నతంగా ఎదగాలని భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పొన్నగంటి రమణ అన్నారు. గురువారం ఆ పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. బాలికల సంరక్షణ, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురుషులతో సమానంగా పోటీపడాలన్నారు. అనంతరం, సేవ్ గర్ల్ చైల్డ్ అన్న అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. వ్యాసరచనలో కె. సౌజన్య, ఎం. భావన, కె. అమ్మిళ మన్నా, వక్తృత్వ పోటీల్లో ఎం. భావన, బి.దక్షిత, పి.రిష్మా, పెయింటింగ్‌లో ఎం. ముషిని, జి. సందీప్, ఎం. లావణ్య విజేతలుగా నిలిచారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.553.22 కోట్లు

... 5వ పేజీ తరువాయి

వరకు) రూ.681.77 కోట్ల ఆదాయం సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అధికారులు రియల్ ఎస్టేట్ సంస్థలతో సంప్రతింపులు చేసి, ఒప్పందాలన్నింటినీ రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకుని రూ.553.22 కోట్ల ఆదాయం లభించేలా చూశారు. ఇది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో 81.15 శాతం. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రూ.497.22 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. దాంతో పోల్చుకుంటే ఈ ఏడాది 11.26 శాతం వృద్ధి నమోదైందని విశాఖ డీఐజీ బాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఉద్యోగులు 'ఉక్కు'రిబిక్కిరి

... 5వ పేజీ తరువాయి

మెటీరియల్స్ జత చేస్తారు. వాటిని ఎడిషన్లు అంటారు. ఈ ప్రక్రియను చార్జింగ్‌గా వ్యవహరిస్తారు. ఖాళీ ల్యాడిల్స్‌లోకి ఆక్సిజన్ బ్లో చేసి మరో ప్రక్రియకు సిద్ధం చేయడాన్ని కన్వర్టింగ్ ఆపరేషన్‌గా పిలుస్తారు. కాగా ఇప్పటి వరకు నైపుణ్యం ఉన్న సీనియర్లే ఈ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఎవరు ఏ పని అయినా చేయాలని నిర్దేశించారు. ఏమైనా పొరపాట్లు జరిగితే అది ప్రాణాలతో చెలగాటమే. అవగాహన రాహిత్యంతోనే అధికారులు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. వీఆర్ఎస్ పేరుతో సుమారుగా 1,800 మందిని ఇంటికి పంపించేసి, వారు చేసిన పనులన్నీ ఇతరులు పంచుకోవాలని ఆదేశిస్తూ పనిభారం మోపుతున్నారని, పనిగంటలు పెంచేశారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష



విద్యార్థులకు మోడల్ ప్రశ్నాపత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 51 మంది హాజరయ్యారు. చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆదినారాయణ, బాలికల పాఠశాల హెచ్ఎం శివజ్యోతి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో లీడర్సు సొసైటీ అధ్యక్షుడు జంగం జోషి, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి నరేంద్రకుమార్, ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు జి. మోహనరావు, రేఖ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి



సింహాచలం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామిని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి పివి రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న రిటైర్డ్ జడ్జి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఏఈఓ స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

యోగా పోటీలకు 9 మంది బాలికలు ఎంపిక

తగరపువలస, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యోగా పోటీలకు బాలికల ఎంపికలు గురువారం నిర్వహించారు. విజయనగరం జేఎన్‌టీయూ పరిధిలోని 15 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 150 మంది హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు యోగా విన్యాసాలను ప్రదర్శించారు. బి. భవ్యశ్రీ, శ్రీనందిని, ఆర్. భవిత, యం. శ్రీహిత, సీహెచ్ భువనేశ్వరి, పి. శ్రుతి, బి. హర్షిణి ఎంపికయ్యారని నిర్వాహకులు ప్రకటించారు. వీరిలో ఆరుగురు అవంతి విద్యా సంస్థలకు చెందిన వారు ఉన్నారు. వారంతా బెంగళూరులోని స్వామి వివేకానంద యోగా కేంద్రంలో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు.



చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌తో కలిసి వీఎంఆర్‌డీఏ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

త్వరితగతిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం

ఎమ్మెల్యే గంటా ▸ వీఎంఆర్‌డీఏ అధికారులతో సమీక్ష

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నియోజకవర్గంలో వీఎంఆర్‌డీఏ చేపట్టిన మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఆ సంస్థ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు రూ.1709 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఏడు రహదారులను భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యే నాటికి సిద్ధం చేయాలని సీయూపీ శిల్పకు సూచించారు. తంగేడుబిల్లి హౌసింగ్ ప్రాజెక్ట్ రోడ్ల నాణ్యతా లోపంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాదిలోనే రహదారులు పాడైపోయాయన్నారు. దీనిపై చైర్మన్ ప్రణవ్‌గోపాల్ స్పందించి, తాను ఆయా రహదారులను సందర్శిస్తానని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఈట్ స్ట్రీట్, స్మార్ట్ స్ట్రీట్ వంటి ప్రాజెక్టులను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు సర్టిఫికెట్లు'

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడంలో ఎటువంటి ఇబ్బందులు లేవని సీడీసీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 'సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తిప్పలు' శీర్షికన ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ఏయూ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. సర్టిఫికెట్ల జారీలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ఆయా కాలేజీ యాజమాన్యాలు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డీన్ యూజీ, పీజీ ఎగ్జామ్స్, డీన్ కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌ను కలిసి సర్టిఫికెట్లను తీసుకెళ్లాలన్నారు. ఒరిజినల్ డిగ్రీ, ఒరిజినల్ క్యుములేటివ్ మార్కుల లిస్ట్ మాత్రమే ఎగ్జామినేషన్ సెక్షన్‌లో మిగిలి ఉంటాయని, వీటి కోసం కాలేజీలు సీడీసీ నుంచి నో డ్యూస్ తీసు కుని ఎగ్జామినేషన్ విభాగంలో అందించాలన్నారు.

నడిరోడ్డుపై జగన్ షో!

... 5వ పేజీ తరువాయి

వైసీపీ నేతలకు సూచించారు. అయినప్పటికీ రోడ్డుమార్గంలో వెళతామని భీష్మించడంతో సీపీ షరతులతో అనుమతి ఇచ్చారు.

అంతటా అధికార దర్పమే...

తాము ఇంకా అధికారంలోనే ఉన్నామన్నట్టు జగన్ తన పర్యటనను కొనసాగించారు. పోలీసుల షరతులను బేఖాతరు చేస్తూ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్‌షో నిర్వహించారు. కాన్వాయ్‌లో పదికి మించి వాహనాలు ఉండకూడదని, బైక్‌లతో ర్యాలీ నిర్వహించకూడదని, అత్యవసర సర్వీసులకు ఇబ్బంది కలిగించకూడదని పోలీసులు స్పష్టంగా పేర్కొన్నారు. జగన్ పర్యటనలో అన్నింటినీ ఉల్లంఘించినా పోలీసులు కనీసం స్పందించలేదు. ఇదిలావుండగా జగన్ కాన్వాయ్ గోపాలపట్నం చేరుకునే సరికి ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయంలో అంబులెన్స్ వచ్చినా వైసీపీ శ్రేణులు దారి ఇవ్వలేదు. ఇతర ప్రాంతాల నేతలు పెందుర్తి రాకుండా పోలీసులు అడ్డుకోవడంతో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ హడావిడి చేశారు. రోడ్డుపై బైఠాయించి అంతా తమ నియోజకవర్గ శ్రేణులేనంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిని పెందుర్తి తరలించినా పోలీసులు కిమ్మనలేదు

స్టీల్‌ప్లాంటుపై మొసలి కన్నీరు

సీఎంగా ఉన్న ఐదేళ్లు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంశంపై స్పందించని జగన్ ఈ పర్యటనలో మొసలికన్నీరు కార్చడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గత ఎన్నికలకు ముందు సీఎం హోదాలో జగన్ నగరానికి వచ్చి పీఎం పాలెంలో బస చేయగా స్టీల్‌ప్లాంటు కార్మిక సంఘాల నేతలు కలిశారు. ప్లాంటు నష్టాల్లో ఉన్నందున విద్యుత్ బకాయిలను మాఫీ చేయాలని కోరారు. దాంతో 'స్టీల్ ప్లాంటు నష్టాల్లో ఉందా...? తెలియదే... అయినా విద్యుత్ చార్జీలు, పన్నులు కట్టమంటే ఎలా అవుతుంది చెప్పండి' అంటూ ఎదురుప్రశ్నించడంతో వారంతా అవాక్కయ్యారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను ఆపేందుకు కృషిచేయాలంటూ అదే జగన్‌కు ఇప్పుడు ఉక్కు కార్మిక సంఘాల నేతలు కాకానినగర్ వద్ద వినతి పత్రం ఇవ్వడం కొసమెరుపు. దీనికి ఆయన స్పందిస్తూ 'నేను అధికారంలో ఉన్నప్పుడు...ఇప్పుడు కూడా స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకమే' అని చెప్పడం విశేషం. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు కూర్మన్నపాలెం వద్ద సంవత్సరాల తరబడి నిరశన శిబిరం నిర్వహించారు. ఆ సమయంలో సీఎంగా ఉన్న జగన్...ఒక్కసారి కూడా శిబిరాన్ని సందర్శించిన పాపానపోలేదు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్ బదిలీ

... 5వ పేజీ తరువాయి

తీసుకువచ్చారు. భోగాపురం విమానాశ్రయాన్ని కలుపుతూ మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను పట్టాలెక్కించారు. ఇక జీవీఎంసీలో ఉండగా చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించి, పాడైన చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టారు. సుమారు ఐదు చెరువులను పునర్నిర్మించి, వాటికి నిత్యం నీరందే ఏర్పాట్లు చేశారు. విశాఖ- భీమిలి మార్గంలో పలుచోట్ల తీర ప్రాంతం కోతకు గురవుతున్న నేపథ్యంలో పరిరక్షణకు కేంద్రం విశాఖ ఎంపీ సాయంతో ఇటీవల రూ.220 కోట్ల నిధులు సాధించారు. విశాఖలో మధ్య తరగతి ప్రజల కోసం ఎంఐజీ ఫ్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి పనిని నిర్దిష్ట సమయంలో పూర్తిచేసేలా సిబ్బందిని సమన్వయపరిచారు.

శ్రీమతికి బదిలీతో...

విశ్వనాథన్ శ్రీమతి విశ్వాంజలి గైక్వాజ్ ఐఎఫ్ఎస్ అధికారిణి. విశాఖపట్నం రీజియన్ పాస్‌పోర్టు అధికారిగా పనిచేసేవారు. రెండు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం ఆమెను తైవాన్‌కు అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా పంపింది. మూడేళ్ల వరకు ఆమె అక్కడే ఉంటారు. ఈ నేపథ్యంలో విశ్వనాథన్ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రతించి తనను బదిలీ చేయాలని కోరారు. విశాఖ వచ్చి ఎక్కువ కాలమే అయినందున మరో శాఖలో పనిచేసే అవకాశం ఇవ్వాలని కోరడంతో ప్రభుత్వం అనుమతించి విజయవాడకు బదిలీ చేసింది.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

... 5వ పేజీ తరువాయి

అందిస్తామని ఆషా ప్రకటించింది.

పేరుకుపోయిన బకాయిలు..

జిల్లాలో మొత్తం 85 నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. వీటిలో ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రులు 65. ఈ ఆస్పత్రులకు సుమారు రూ.150 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి కనిష్ఠంగా రూ.50 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్టు ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఆరిలోవ హెల్త్‌సిటీలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి రూ.22 కోట్ల వరకు బకాయి ఉండగా, మరో ఆస్పత్రికి రూ.15 కోట్లు, ఇంకో ఆస్పత్రికి రూ.10 కోట్లు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంది. నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టమవుతోందని ఆషా ప్రతినిధులు వాపోతున్నారు. ఈనేపథ్యంలో అప్పులు చేసి మరీ సిబ్బందికి జీతాలు చెల్లించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని అసోసియేషన్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇదిలా ఉంటే నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెకు దిగిన నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి నగర పరిధిలోని ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందేందుకు వచ్చే రోగులు పునరాలోచించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆషా ప్రతినిధులతో చర్చలు జరుపుతోందన్నారు. కాగా అత్యవసర శస్త్ర చికిత్సల నిర్వహణలో ఆస్పత్రుల యాజమాన్యాలు అశ్రద్ధ చేస్తే చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు.

ఆర్టీసీ వైఎస్సార్ ఈఏ నూతన కార్యవర్గం



ఆర్ఎం అప్పలనాయుడుకు నూతన కార్యవర్గం ప్రతి అందజేస్తున్న దృశ్యం

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజనల్ కమిటీకి నూతన కార్యవర్గం ఎన్నికైంది. మద్దిలపాలెం అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన రీజనల్ స్థాయి సమావేశం ఈ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది. అధ్యక్షుడుగా బి.లక్ష్మణరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఆర్ఎల్ రాజు, చైర్మన్‌గా ఎం.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఐఆర్ వర్మ, వీవీఎస్ఎన్ రాజు, రీజనల్ కార్యదర్శిగా కేవీ బాబు, సంయుక్త కార్యదర్శులుగా జి.ప్రసాద్, పీఎస్ఎన్ ప్రసాద్, డి.రమాదేవి, కోశాధికారిగా ఎన్‌వీ మూర్తి, సహాయ కార్యదర్శులుగా బీఎల్ రాజు, యూఎన్ఆర్ లక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఏజే రావు, జీవీ లక్ష్మి ఎన్నికయ్యారు. అనంతరం వీరంతా రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి నూతన కార్యవర్గం ప్రతిని అందజేశారు.

అన్న సమారాధన

ఆరిలోవ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : దుర్గానవరాత్రుల సందర్భంగా జీవీఎంసీ 11వ వార్డులో గల కనకదుర్గా యువజన సేవా సంఘం అధ్యక్షుడు పచ్చిపాల శ్రీను ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాపరుద్ర భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అంతకుముందు ఆయన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సుమారు 2500 మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మూది అప్పారావు, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, జనసేన నాయకులు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల కోసం పాల్ ప్రివెన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు

ఆరిలోవ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్యంలో అనేక శారీరక సమస్యలు ఎదురవుతాయని, వినికిడి లోపం, దృష్టి లోపం వంటి వాటిని అధిగమించేందుకు ఎల్వీపీ వైద్యశాలలో పాల్ ప్రివెన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు నేత్ర సంరక్షణ వృద్ధ విభాగాధిపతి, నేత్ర వైద్యులు డాక్టర్ అవినాష్ పతంగి తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వృద్ధులకు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. వారికి ఊతకర్రలను అందించారు. తొలుత కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి.
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 21, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 32, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 52, దొండకాయలు 32, బంగాళ దుంపలు 20 అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 72, బరబాటి 36, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 26, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు బ్రాయిలర్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

తొలగించిన దుకాణాలు ప్రత్యక్షం

» ఆపరేషన్ లంగ్స్‌కు సవాల్ » యథా స్థానంలో బడ్డీలు ఏర్పాటు చేసి అమ్మకాలు



కొన్ని రోజుల కిందట బడ్డీలు తొలగించిన ఎంవీపీ సర్కిల్-ఉషోదయ రోడ్డులో వెలిసిన దుకాణాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగర సుందరీకరణ పేరిట చేపట్టిన ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా నగరంలోని పలు చోట్ల బడ్డీలను తొలగించిన ప్రాంతంలోనే మళ్లీ బడ్డీలు యథాతథంగా వెలిశాయి. వ్యాపారులు యథేచ్ఛగా తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఎంవీపీ కాలనీలో రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించడంతో విశాలమైన రహదారులు కనిపించాయి. దీంతో వాహనదారులు, స్థానికుల ఆనందం వ్యక్తం చేశారు. కాగా ఒక్కో ప్రాంతంలో కొన్ని చోట్ల తొలగించి, మరి కొన్ని చోట్ల తొలగింపు చేపట్టలేదు. దసరా తర్వాత వాటిని తొలగిస్తామని చెప్పినా, దసరా వెళ్లి వారం రోజులు గడుస్తున్నా, మళ్లీ ఆ ఊసే లేకపోవడంతో, తిరిగి తొలగించిన చోటే కొందరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు మళ్లీ మొదలు పెట్టారు. కొన్ని మాత్రమే తొలగించి, మరికొన్నింటి జోలికి వెళ్లకపోవడంతో కొందరికి మోదం, కొందరికి ఖేదంలా మారింది. దసర పండగ సందర్భంగా చాలా మంది వ్యాపారాలు దర్జాగా చేసుకోగా, దుకాణాల తొలగింపునకు గురైన వ్యాపారులు, అందులో పని చేసేవారూ పనుల్లేక ఇబ్బంది పడాల్సి వచ్చింది.

దీంతో తొలగించకుండా ఉన్న వారు వ్యాపారాలు చేసుకుంటుండడంతో, తొలగింపుతో ఇబ్బంది పడిన వారు మళ్లీ పాత వ్యాపారాలను పునరుద్ధరించుకునే పనిలో పడ్డారు.

కళావిహీనంగా ముడసర్లోవ పార్కు



పార్కులో సంచరిస్తున్న పశువులు

ఆరిలోవ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు నగరంలో ఆహ్లాదకర వాతావరణానికి ప్రతీకగా నిలిచిన ముడసర్లోవ పార్కు అధ్వానంగా తయారైంది. ఒకప్పుడు ఎటు చూసినా అందాలు సోయగాలు వెదజల్లిన పార్కులో సినిమా షూటింగులు జరిగేవి. నగరంలో ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా ముడసర్లోవ పార్కు బాసిల్లింది. అయితే నిర్వహణ కొరవడడంతో అంతకంతకూ ఈ పార్కు అధ్వానంగా తయారైంది. ఇప్పుడు పశువులు, గొర్రెలు వంటివి మేత మేస్తూ పార్కులో దర్శనమిస్తున్నాయి. తుప్పలు పెరిగిపోవడంతో విష సర్పాలు, పురుగులు వంటివి కూడా పెరిగాయి. పార్కు ఇంత అధ్వానంగా తయారైనా, దీని పునరుద్ధరణ గురించి ప్రజాప్రతినిధులు, అధి కారులు పట్టించుకోకపోవడంపై విమర్శలువెల్లువెత్తుతున్నాయి. పలుమార్లు ఈ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పడం తప్ప ఆచరణలో కనపించడం లేదన్న అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నగరంలోని ముఖ్య కూడలిలో ఉన్న ముడసర్లోవ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'సఖీ సురక్ష'తో మహిళా ఆరోగ్య పరిరక్షణ

» 26 నుంచి సురక్ష కేంద్రాల్లో వైద్య పరీక్షలు
» కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్



సఖీ సురక్ష పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరింధరప్రసాద్, పాల్గొన్న యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సరోజిని, పలువురు అధికారులు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 9, (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యానికి 'సఖీ సురక్ష' రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో గురువారం మెప్మా ఆధ్వర్యంలో సఖీ సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగంగాపట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘం మహిళల ఆరోగ్యం, సామాజిక ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల ఆర్థిక పురోగతికి, వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారన్నారు విధి నిర్వహణలో నిమగ్నమై ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండడం లేదని భావించి వారి ఆరోగ్య రక్షణకు కవచంగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం నిజంగా గొప్ప విషయమన్నారు. మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ 35 ఏళ్ల దాటిన ప్రతి మహిళకు దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్ తదితర గుండె జబ్బుల ప్రమాద కారకాల వ్యాధులకు సంబంధించిన వాటిని రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 26 నుంచి సురక్ష కేంద్రాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సరోజిని తదితరులు పాల్గొన్నారు.



సఖీ సురక్ష కేంద్రంలో వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎం సత్యవేణి, పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

» జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

బీచ్ రోడ్డు, అక్టోబర్ 9, (ఆంధ్రజ్యోతి) : పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సీఎంఎఫ్ఆర్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సంప్రదాయ మత్స్యకారులతో వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు వేట విధానాలు, మత్స్య సంపద నాణ్యత మార్కెటింగ్ సుస్థిర వేట విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీ వీడ్ పెంపకం, కేజ్ పెంపక విదానాల ద్వారా ఉపాధి తొకాశాలు పెంచుకోవాలని సూచించారు. అనంతరం మత్స్యకారులను నీలి యోధులుగా గుర్తించి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డా.. మీనా నిస్పాట్, శాస్త్రవేత్త డా.. మధుసూధనరావు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, మహంతి డిడి ఎంపాడా, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.



నీలి యోధులుగా గుర్తించిన మత్స్యకారులను సన్మానిస్తున్న కలెక్టర్

ఫుట్‌పాత్‌లపై చెట్ల మానులు.. వాకర్స్ ఇబ్బందులు



ఫుట్ పాత్‌పై పడి ఉన్న చెట్టు మాను

ఆరిలోవ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ రిజర్వాయర్ సమీపంలో లగల బీఆర్టీఎస్ సర్వీసు రోడ్డుకు ఆనుకొని సుమారు 9 అడుగుల మేర ఫుట్‌పాత్‌లు ఉన్నవి. ఈ మార్గంలో ఎక్కువ మంది మార్నింగ్ వాక్ చేస్తుంటారు. ఇటీవల వీచిన ఈదురు గాలులకు ఫుట్‌పాత్‌ను అనుకొని ఉన్న చెట్లు నేలకొరిగాయి. ఈ క్రమంలో.. నేల కొరిగిన చెట్లను కొందరు నరికి కొమ్మలను వంట చెరకుగా ఉపయోగించేందుకు తీసుకెళ్లగా, మానులను ఫుట్‌పాత్‌పై పడేశారు. దీంతో ఫుట్‌పాత్‌పై మార్నింగ్ వాక్ చేసే వారికి ఈ చెట్ల మానులు ఇబ్బందిగా తయారయ్యాయి.

గత వారం నుంచి ఫుట్‌పాత్‌పై నడిచేందుకు చాలా ఇబ్బందిగా ఉంటోందని పలువురు వాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం తాము వాకింగ్ చేస్తుండగా, మధ్య మానులు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని, వృద్ధాప్యంలో ఇది చాలా ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

ఈ సమస్యపై అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఉన్న చెట్ల మానుల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తుప్పు పట్టి.. తుక్కుగా మారాల్సిందేనా?

» ఏళ్ల తరబడి పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పోలీస్ స్టేషన్ల ఆవరణల్లోనే.. » ఎండావానల్లో పాడవుతున్న వెహికల్స్

ఆరిలోవ, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ పాత పోలీసు స్టేషన్ వద్ద వందలాది ద్విచక్రవాహనాలు మూలకు పడి ఉన్నాయి. ఈ వాహనాలన్నీ ఎండకు ఎండి, వానకు తడిస్తూ పాడవుతున్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ఈ వాహనాలు తుక్కుగా మారాయి. ఈ వాహనాలకు ఇక్కడ తొలగించకపోవడంతో పోలీస్‌స్టేషన్ ఆవరణలో కూడా ఇబ్బందిగా ఉంటోంది.

కొన్ని చోరీ కేసులు, ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు వంటి సమయాల్లో పోలీసులు స్వాధీనం చేసుకొన్న ద్విచక్ర వాహనాలను పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచారు. ఇది కొన్నళ్ల నుంచి సాగుతోంది. అయతే ఈ వాహనాలను ఎప్పుడూ తొలగించకపోవడం, వాహనదారులకు వాపసు ఇవ్వకపోవడం వంటి చర్యలు చేపట్టకపోవడంతో వందలాది వాహనాలు ఇక్కడ పేరుకుపోయాయి. ఎలాంటి నిర్వహణ లేని ఈ వాహనాలు తుప్పు పట్టి బాగా పాడయ్యాయి.





పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో అస్తవ్యస్తంగా పడి ఉన్న ద్విచక్ర వాహనాలు

వర్షాలు పడినప్పుడు నీరు చేరడం, దుమ్ము, ధూళి చేరడంతో పూర్తిగా పాడైన వాహనాలు ఎన్నో ఇందులో ఉన్నాయి. ఈ వాహనాలు ఉన్న చోట పారిశుధ్య నిర్వహణ కూడా లేకపోవడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. పాములు, విష పురుగులు సంచరిస్తుంటాయి. దోమలకు నిలయంగా మారింది. దీంతో సీజనల్ వ్యాధులు కూడా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని పోలీసు సిబ్బంది, స్థానికుల ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కుప్పలుగా పడేసిన ఈ వాహనాల తరలింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆరో తరగతి విద్యార్థులకు అందని యూనిఫాం దుస్తులు

» ఉపాధ్యాయుల తప్పిదం ఫలితం
» కొత్తగా చేరిన వారి పేర్లు నమోదులో నిర్లక్ష్యం
» భీమిలి మండలంలో 174 మందికి అందని దుస్తులు



యూనిఫామ్ దుస్తులు అందకపోవడంతో సివిల్ డ్రెస్‌లలో స్కూలుకు వచ్చిన విద్యార్థులు

భీమునిపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందలేదు. కొత్తగా చేరిన విద్యార్థులకు ఉపాధ్యాయులు సరైన సమయంలో ఇండెంట్ పెట్టకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. భీమిలి అర్బన్, రూరల్ మండలాల్లో ఉన్న ఈ పాఠశాలల్లో మొత్తం 917 మంది 6వ తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి అదనంగా మరో 174 మంది చేరారు. పాఠశాల పునఃప్రారంభించి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ కొత్తగా చేరిన వారికి పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందలేదు.

దీంతో కొందరు సివిల్ దుస్తులతో వస్తుండగా మరికొందరు ప్రాథమిక పాఠశాల యూనిఫారాలతో వస్తున్నారు. మిగతా మండలాల్లోనూ ఇదే సమస్య ఉన్నా.. సీఆర్‌పీలు వారి పరిధిలోని పాఠశాలల్లో పర్యటించి ఎక్కడైనా అవసరానికి మించి పాఠ్య పుస్తకాలు ఉంటే వాటిని సేకరించి పుస్తకాలు చాలని చోట అప్పగించారు. కానీ ఇక్కడ ఆ పరిస్థితి లేదు. ఈ విషయమై ఎంఈవో -2 జయప్రద వద్ద ప్రస్తావించగా మండలంలో మొత్తం 6వ తరగతి విద్యార్థులు 1091 మంది ఉండగా పాత విద్యార్థులు 917 మంది, కొత్తగా చేరిన వారు 174 మంది ఉన్నారన్నారు.

కొత్తగా చేరిన వారికి పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందలేదని, ఇండెంట్ పెట్టామని చెప్పారు. ఈ సమస్య డీఈవో దృష్టిలో కూడా ఉందన్నారు.

జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఆరోగ్యశాఖలో కీలక మార్పులు

» డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఆరోగ్యశాఖలో అనేక మార్పు లు చోటు చేసుకున్నాయని, కీలక మందులు, ఆరోగ్యబీమా దరలు భారీ గా తగ్గుముఖం పట్టాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవా రం ఉదయం చిత్రాలయ థియేటర్ దగ్గరలోని జోన్-4 కార్యాలయ భవనం లో జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రైవేటు ఆస్పత్రులు, ఇన్సూరెన్స్ యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలతో అనేక రకాల మందులు ఐదు శాతం, కొన్ని అత్యవసర మందులు సున్నా జీఎస్టీ పరిధిలోకి వచ్చాయన్నారు. నూతన సంస్కరణలతో ఆరోగ్య రంగంపై కీలక మైన ప్రభావాన్ని చూపించిందన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యు లు, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్ యజ మానులు, బీమా సిబ్బంది జీఎస్టీ సంస్క రణలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

జిల్లా ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ మాట్లాడు తూ జీఎస్టీ శ్లాబుల మార్పులతో ఆరోగ్య రంగానికి సంబంధించిన అనేక ధరల్లో మార్పులు వచ్చా యన్నారు. నూతన శ్లాబులకు అనుగుణంగా కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని నిర్వహించారు.

శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం
రామకృష్ణానగర్, విశాఖపట్నం

టెండర్లు

ఆర్.సి.నెం. Nil/2025. తేది. 05.10.2025.

ఈ దిగువ తెలిపిన వివిధ అంశములకు శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆలయము యందు టెండర్లు ప్రతిపాదన తేది:18-10-2025 శనివారం ఉదయం 09.00 గంటల వరకు స్వీకరించి ఉదయం 10 గంటలకు హాజరైన టెండరు దారుల/పాటదారుల సమక్షంలో తెరువబడును. టెండరు షెడ్యూల్స్ తేది.16-10-2025 నుండి 17-10-2025 వరకు విక్రయించబడును.

వ. నెం.	వివరము	లైసెన్స్ కాలపరిమితి	షెడ్యూల్ వెల	ధరావత్తు
1.	పువ్వులు/పూలదండలు మరియు పూల అలంకరణ	20.10.2025 నుండి 31.10.2026 వరకు	100.00	1,000.00
2	సప్లయి సామగ్రి	20.10.2025 నుండి 31.10.2026 వరకు	100.00	1,000.00
3	విద్యుత్ దీపాలంకరణ (వేరు వేరుగా)	కార్తీక మాసం నెలరోజులు శివరాత్రి మరియు శ్రీ స్వామి వారి వార్షిక కళ్యాణం	100.00	1,000.00
4	మహా అన్నదానం నకు వంటలు తయారు చేయుటకు (లేబర్ ఛార్జీలు)	18.11.2025	100.00	1,000.00
5	పూజాసామగ్రి సప్లయికి	20.10.2025 నుండి 31.10.2026 వరకు	100.00	1,000.00

మిగిలిన వివరములు దేవస్థాన కార్యాలయము నందు పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.
విశాఖపట్నం
తేది.08-10-2025 కార్యనిర్వహణాధికారి

ఉత్తరాంధ్రపై జగన్‌ది సవతితల్లి ప్రేమ

» అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డీసీసీబీ చైర్మన్ కోనతాతారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, చిత్రంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రపై వైసీసీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని, వైసీపీ హయాంలో విద్యాభివృద్ధిని గాలికి వదిలేశారని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే సీనియర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని పేర్కొన్నారు. ఆయనలో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజల అభి వృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. తల్లికి వందనం, ప్రతినెలా పింఛన్లు, స్త్రీశక్తి పథకం విజవంతంగా అమలు చేస్తున్నట్టు గుర్తుచేశారు. వీటితో పాటు ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ఇటీవల రూ.15 వేలను కానుకగా అందించినట్టు చెప్పారు. మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద మారుస్తున్నారని జగన్మోహన్‌రెడ్డి మొసలికన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మెడికల్ కాలేజీల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన పాపాన పోలేదన్నారు. 17 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రభుత్వం అప్పగిస్తుంది అనడంలో ఏ మాత్రం నిజం లేదన్నారు. కేంద్రం ఏడు కాలేజీలకు సిఫార్సు చేస్తే ప్రస్తుతం నాలుగు కాలేజీలు మాత్రమే ఆమోదం పొందాయని తెలిపారు. అందులోనూ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయడంతో పాటు ఆయా కళాశాలల్లోని సీట్లు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పీపీపీ పద్ధతిలో అంగీకరించిన తరువాత 33 ఏళ్ల అనంతరం ప్రభుత్వం వాటిని తిరిగి తీసుకుంటుందని చెప్పారు. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తుంటే జగన్‌రెడ్డి అర్థంలేని రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు వాటిని పట్టించుకుంటారనే నమ్మకం లేదన్నారు. ఈ సమావేశంలో డిప్యూటి మేయర్ దల్లి గోవిందరెడ్డి, జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషారాణి, ఫ్లోర్ లీడర్ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది డీవీఎస్‌కే వరప్రసాద్‌కు సత్కారం



న్యాయవాది వరప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అల్లిపురం, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డిస్ట్రిక్ అండ్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్-2 గా నియమితులైన డీవీఎస్‌కే వరప్రసాద్‌ను విశాఖ టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, ప్రభుత్వ న్యాయవాది బుగతా సత్యనారాయణ గురువారం సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమంలో న్యాయవాదులు కర్రి పార్థసారథి, ఆడారి అప్పారావు, పల్లా బాలాజీ, శివకుమార్ ఉన్నారు.

అగనంపూడిలో దోపిడీ

... 5వ పేజీ తరువాయి

దోచుకుని వెళ్లిపోయాడు. తేరుకున్న అమ్మన్న కేకలు వేయడంతో మనవడు సుమంత్ పరుగున రెండో అంతస్థుకు చేరుకునే సరికి దుండగుడు ఉడాయించాడు. అమ్మన్న కుమార్తె శ్రావణి దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. స్థానికులే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. సీసీ టీవీ పుటేజీ పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు



రాంజీ ఎస్టేట్ పాఠశాల



తరగతి గదిలో విద్యార్థులు

» జీవీఎంసీ రాంజీ ఎస్టేట్ ఉన్నత పాఠశాలలో దుస్థితి
» అప్‌గ్రేడ్ చేసిన తరువాత భర్తీ చేయని పోస్టులు
» విద్యార్థులకు అరకొరగా బోధన

కంచరపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డులో రాంజీ ఎస్టేట్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం జరగక, బోధన కుంటుపడుతోంది. దీర్ఘకాలంగా కొండవాలు గ్రామాల విద్యార్థులకు ఉన్నత పాఠశాల అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా స్థానికుల నుంచి డిమాండ్ ఉంది. అయితే మూడు నెలల క్రితం రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను అప్పర్ ప్రైమరీ పాఠశాలగా విద్యాశాఖ మార్చుచేసింది. పాఠశాలను అప్‌గ్రేడ్ చేసినా ఉపాధ్యాయుల సర్దుబాటు అంశాన్ని అధికారులు పట్టించుకోలేదు. పాఠశాలలో ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులే పనిచేస్తుండడంతో వారిపై అధిక పనిభారం పడుతోంది. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన కుంటుపడుతుండడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అసహనం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభమై నాలుగు నెలలె పూర్తి అవుతున్నా ఇంత వరకు ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు బోధించడానికి ఉపాధ్యాయులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యకత్తం చేస్తున్నారు.

కొత్త ఉపాధ్యాయులపై ఆశలు...

ఇటీవల ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన కొత్త ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు వస్తారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల్లో 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఆరు, ఏడు తరగతుల్లో 51 మంది పిల్లలు ఉన్నారు. వీరికి కనీసం సబ్జెక్టుకు ఒకరు చొప్పున ఉపాధ్యాయులు ఉండాలి. వీరి నియామకం జరగకపోవడంతో సిలబస్ పూర్తి కాలేదు. త్వరలో విధుల్లోకి చేరనున్న కొత్త ఉపాధ్యాయులను రాంజీ ఎస్టేట్ పాఠశాలకు కేటాయించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం



కార్యక్రమానికి హాజరైన సీపీ శంఖబ్రత బాగ్చి



గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న ప్రగడ వాసు

అక్కయ్యపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నగర సీపీ శంఖబ్రత బాగ్చి హాజరైయారు. ఈ మేరకు కేఎస్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు నిరాశ్రయులకు అందించిన నిత్యావసర సరకులను సీపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ తమ సోమా జ్యోతిర్గమయ ద్వారా యాచకులకు, నిరాశ్రయులకు మంచి చేసే ఉద్యమంలో ఏయూటీడీ లాంటి సంస్థలు నిర్వహిస్తున్న షెల్టర్లకు పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు దాతలు అండగా ఉండాలని కోరారు. భవిష్యత్తులో నిరాశ్రయ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామన్నారు. అనంతరం వసతి గృహానికి వచ్చిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, అకాడమీ సభ్యులు జీఎస్ఎన్ రాజు, సత్యనారాయణ చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

'సేవ్ గర్ల్ చైల్డ్' పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలో ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలలోని 'సేవ్ గర్ల్ చైల్డ్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జయంతి రాధాకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాధాన్యం తెలియజేశారు. అనతరం సేవ్ గర్ల్ చైల్డ్ అంటూ నినాదాలు చేసి విద్యార్థులు ప్రదర్శన చేశారు. అలాగే విద్యార్థులు మండల స్థాయిలో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, గ్లోరీ, పీడీ రత్నం, ఎన్‌సీసీ అధికారి ఎంఎన్‌వీ విశ్వనాథం పాల్గొన్నారు.

తవ్వేస్తున్నారు... వదిలేస్తున్నారు

» ఏదో ఒక పనితో రోడ్ల తవ్వకాలు
» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పనుల కోసం రహదారులకు తవ్వుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో 26వ వార్డు చిన్నూరు మసీదుకు ఆనుకుని ఉన్న రోడ్డును మూడు నెలల క్రితం తవ్వి ఇప్పటి వరకూ ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు వచ్చి పనులు చేస్తున్నట్టు హడావుడి చేస్తున్నారు తప్పా ఏమీ చేయడం లేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి గెడ్డ ఆధునీకరణ పనులు పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని కోరుతున్నారు. ఇదే కాకుండా ఆయా ప్రాంతాల్లో కొత్తగా మంచినీటి పైప్‌లైన్ కోసమని ఒక రహదారిలో, భూగర్భ విద్యుత్ లైన్ల కోసమని మరోక దారిలో, మంచినీటి లైన్ మరమ్మతులంటూ ఇంకో దారిలో రోడ్లను తవ్వి పూడ్చకుండా విడిచిపెట్టడంతో తాము అవస్థలు పడుతున్నామని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్, తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లను ఎక్కడికక్కడ తవ్వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఏదైనా పని కోసం రోడ్లను తవ్వినా తిరిగి పూడ్చేసి ప్యాచ్ వర్కులు చేసేవారు. కానీ ఈ మధ్య ఎదోక పని కోసం రోడ్లను తవ్వేస్తున్నారు. కానీ పూడ్చడంలో మాత్రం తీవ్రమైన జాప్యం చేస్తున్నారు. దీనికి తోడు వర్షాలు పడి ఆ గుంతల్లో నీరు, బురద నిలిచిపోయి రోడ్డు మొత్తం చిందరవందరగా తయారవుతోంది. కొన్ని సమయాల్లో వాహనాలు గోతుల్లో కూరుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్విన రోడ్లును పూడ్చి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నూరులో తవ్వి వదిలేసిన రోడ్డు

నడిరోడ్డుపై జగన్ షో!

... 5వ పేజీ తరువాయి

వైసీపీ నేతలకు సూచించారు. అయినప్పటికీ రోడ్డుమార్గంలో వెళతామని భీష్మించడంతో సీపీ షరతులతో అనుమతి ఇచ్చారు.

అంతటా అధికార దర్పమే...

తాము ఇంకా అధికారంలోనే ఉన్నామన్నట్టు జగన్ తన పర్యటనను కొనసాగించారు. పోలీసుల షరతులను బేఖాతరు చేస్తూ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్‌షో నిర్వహించారు. కాన్వాయ్‌లో పదికి మించి వాహనాలు ఉండకూడదని, బైక్‌లతో ర్యాలీ నిర్వహించకూడదని, అత్యవసర సర్వీసులకు ఇబ్బంది కలిగించకూడదని పోలీసులు స్పష్టంగా పేర్కొన్నారు. అయితే జగన్ పర్యటనలో అన్నింటినీ ఉల్లంఘించినా పోలీసులు కనీసం స్పందించలేదు. ఇదిలావుండగా జగన్ కాన్వాయ్ గోపాలపట్నం చేరుకునే సరికి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. అదే సమయంలో అంబులెన్స్ వచ్చినా వైసీపీ శ్రేణులు దారి ఇవ్వలేదు. ఇతర ప్రాంతాల నేతలు పెందుర్తి రాకుండా పోలీసులు అడ్డుకోవడంతో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ హడావిడి చేశారు. రోడ్డుపై బైఠాయించి అంతా తమ నియోజకవర్గ శ్రేణులేనంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిని పెందుర్తి తరలించినా పోలీసులు కిమ్మనలేదు

స్టీల్‌ప్లాంటుపై మొసలి కన్నీరు

సీఎంగా ఉన్న ఐదేళ్ల స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంశంపై స్పందించని జగన్ ఈ పర్యటనలో మొసలికన్నీరు కార్చడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గత ఎన్నికలకు ముందు సీఎం హోదాలో జగన్ నగరానికి వచ్చి పీఎం పాలెంలో బస చేయగా స్టీల్ ప్లాంటు కార్మిక సంఘాల నేతలు కలిశారు. ప్లాంటు నష్టాల్లో ఉన్నందున విద్యుత్ బకాయిలను మాఫీ చేయాలని కోరారు. దాంతో స్టీల్‌ప్లాంటు నష్టాల్లో ఉందా...? తెలియదే... అయినా విద్యుత్ చార్జీలు, పన్నులు కట్టమంటే ఎలా అవుతుంది చెప్పండి' అంటూ ఎదురుప్రశ్నించడంతో వారంతా అవాక్కయ్యారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను ఆపేందుకు కృషిచేయాలంటూ అదే జగన్‌కు ఇప్పుడు ఉక్కు కార్మిక సంఘాల నేతలు కాకానినగర్ వద్ద వినతిపత్రం ఇవ్వడం కొసమెరుపు. దీనికి ఆయన స్పందిస్తూ 'నేను అధికారంలో ఉన్నప్పుడు...ఇప్పుడు కూడా స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకమే' అని చెప్పడం విశేషం. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు కూర్మన్నపాలెం వద్ద సంవత్సరాల తరబడి నిరశన శిబిరం నిర్వహించారు. ఆ సమయంలో సీఎంగా ఉన్న జగన్...ఒక్కసారి కూడా శిబిరాన్ని సందర్శించిన పాపానపోలేదు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్ బదిలీ

... 5వ పేజీ తరువాయి

తీసుకువచ్చారు. భోగాపురం విమానాశ్రయాన్ని కలుపుతూ మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను పట్టాలెక్కించారు. ఇక జీవీఎంసీలో ఉండగా చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించి, పాడైన చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టారు. సుమారు ఐదు చెరువులను పునర్నిర్మించి, వాటికి నిత్యం నీరందే ఏర్పాట్లు చేశారు. విశాఖ- భీమిలి మార్గంలో పలుచోట్ల తీర ప్రాంతం కోతకు గురవుతున్న నేపథ్యంలో పరిరక్షణకు కేంద్రం విశాఖ ఎంపీ సాయంతో ఇటీవల రూ.220 కోట్ల నిధులు సాధించారు. విశాఖలో మధ్య తరగతి ప్రజల కోసం ఎంఐజీ ఫ్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి పనిని నిర్దిష్ట సమయంలో పూర్తిచేసేలా సిబ్బందిని సమన్వయపరిచారు.

శ్రీమతికి బదిలీతో...

విశ్వనాథన్ శ్రీమతి విశ్వాంజలి గైక్వాజ్ ఐఎఫ్ఎస్ అధికారిణి. విశాఖపట్నం రీజియన్ పాస్‌పోర్టు అధికారిగా పనిచేసేవారు. రెండు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం ఆమెను తైవాన్‌కు అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా పంపింది. మూడేళ్ల వరకు ఆమె అక్కడే ఉంటారు. ఈ నేపథ్యంలో విశ్వనాథన్ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రతించి తనను బదిలీ చేయాలని కోరారు. విశాఖ వచ్చి ఎక్కువ కాలమే అయినందున మరో శాఖలో పనిచేసే అవకాశం ఇవ్వాలని కోరడంతో ప్రభుత్వం అనుమతించి విజయవాడకు బదిలీ చేసింది.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

... 5వ పేజీ తరువాయి

అందిస్తామని ఆషా ప్రకటించింది.

పేరుకుపోయిన బకాయిలు..

జిల్లాలో మొత్తం 85 నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. వీటి లో ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రులు 65. ఈ ఆస్పత్రులకు సుమారు రూ.150 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి కనిష్ఠంగా రూ.50 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్టు ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఆరిలోవ హెల్త్‌సిటీలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి రూ.22 కోట్ల వరకు బకాయి ఉండగా, మరో ఆస్పత్రికి రూ.15 కోట్లు, ఇంకో ఆస్పత్రికి రూ.10 కోట్లు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంది. నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టమవుతోందని ఆషా ప్రతినిధులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అప్పులు చేసి మరీ సిబ్బందికి జీతాలు చెల్లించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని అసోసియేషన్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇదిలా ఉంటే నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెకు దిగిన నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి నగర పరిధిలోని ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందేందుకు వచ్చే రోగులు పునరాలోచించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆషా ప్రతినిధులతో చర్చలు జరుపుతోందన్నారు. కాగా అత్యవసర శస్త్ర చికిత్సల నిర్వహణలో ఆస్పత్రుల యాజమాన్యాలు అశ్రద్ధ చేస్తే చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు.

ఉద్యోగులు 'ఉక్కు'రిబిక్కిరి

... 5వ పేజీ తరువాయి

మెటీరియల్స్ జత చేస్తారు. వాటిని ఎడిషన్లు అంటారు. ఈ ప్రక్రియను చార్జింగ్‌గా వ్యవహరిస్తారు. ఖాళీ ల్యాడిల్స్‌లోకి ఆక్సిజన్ బ్లో చేసి మరో ప్రక్రియకు సిద్ధం చేయడాన్ని కన్వర్టింగ్ ఆపరేషన్‌గా పిలుస్తారు.

నిపుణుల కొరతే కారణం


ఇప్పటివరకు నైపుణ్యం ఉన్న సీనియర్లే ఈ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఎవరు ఏ పని అయినా చేయాలని నిర్దేశించారు. ఏమైనా పొరపాట్లు జరిగితే అది ప్రాణాలతో చెలగాటమే. అవగాహన రాహిత్యంతోనే అధికారులు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. వీఆర్ఎస్ పేరుతో సుమారుగా 1,800 మందిని ఇంటికి పంపించేసి, వారు చేసిన పనులన్నీ ఇతరులు పంచుకోవాలని ఆదేశిస్తూ పనిభారం మోపుతున్నారని, పనిగంటలు పెంచేశారని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.553.22 కోట్లు

... 5వ పేజీ తరువాయి

వరకు) రూ.681.77 కోట్ల ఆదాయం సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అధికారులు రియల్ ఎస్టేట్ సంస్థలతో సంప్రతింపులు చేసి, ఒప్పందాలన్నింటినీ రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకుని రూ.553.22 కోట్ల ఆదాయం లభించేలా చూశారు. ఇది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో 81.15 శాతం. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రూ.497.22 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. దాంతో పోల్చుకుంటే ఈ ఏడాది 11.26 శాతం వృద్ధి నమోదైందని విశాఖ డీఐజీ బాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్టు



నిందితుడితో సీఐ దివాకర్, తదితరులు

మహారాణిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రేప్ కేసులో రెండేళ్లగా కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని మహారాణిపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన పదార్తి వీరేంద్ర అలియాస్ చెర్రీ అనే వ్యక్తిని 2017లో రేప్ కేసులో మహారాణిపేట పోలీసులు అరెస్టు చేశారు. బెయిల్ వచ్చిన వీరేంద్ర కోర్టుకు హాజరుకాకుండా రెండేళ్లగా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ రెండేళ్లు పోలీసులకు దొరకకుండా ఉండేందుకు వీరేంద్ర కనీసం మొబైల్ ఫోన్ కూడా వినియోగించలేదు. దీంతో నిందితుడిపై కోర్టు నాన్‌బెయిల్‌బుల్ వారెంటును జారీ చేసింది. సీఐ దివాకర్‌కు వచ్చిన సమాచారం ప్రకారం వీరేంద్రను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.

ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

జ్ఞానాపురం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్యానంతరం తెలుగు- హిందీ సాహిత్యంలో మహిళా రచయితల రచనల విశిష్టతను, సాహిత్య ప్రక్రియలో ప్రాధాన్యం వంటి అంశాలపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి రచయితల అకాడమీ అధ్యక్షుడు, లీడర్ దినపత్రిక ఎడిటర్ వీవీ.రమణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మహిళా రచయితల సాహిత్య కృషి, వారి సమకాలీన సాంఘీక సాంస్కృతిక ప్రాధాన్యంపై ప్రసంగించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సదస్సులో 70 మందికి పైగా వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులు, రాజభాష అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.ఎస్ కృష్ణబాబు, డాక్టర్ డీవీ.సుబ్బారావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ వీకే.జయలక్ష్మి, ప్రొఫెసర్ ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిచా ఘోష్ మెరుపు ఇన్నింగ్స్

... 5వ పేజీ తరువాయి

ఘోష్ బౌండరీలు, సిక్సర్లతో చెలరేగి స్కోరు బోర్డును పరిగెత్తించింది. ఎదుర్కొన్న తొలి బంతి నుంచి సఫారీ బౌలర్లపై దాడికి దిగింది. దక్షిణాఫ్రికా సారధి లౌరా ఎప్పటికప్పుడు బౌలర్లను మార్చినా రిచాను నిలువరించడంలో సఫలం కాలేదు. ప్రతి ఓవర్‌లో కనీసం ఒక బౌండరీ బాది భారత్ శిబిరానికి ఉత్సాహాన్నిచ్చింది. 43.5వ ఓవర్‌లో డి క్లెర్క్ బౌలింగ్‌లో సింగిల్ తీసి 53 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో అర్ధ సెంచరీతో (50) పూర్తిచేసింది. రిచాకు స్నేహ రానా తోడైంది. ఇద్దరూ కలిసి సఫారీ బౌలర్లకు చుక్కలు చూపారు. కేవలం 36 బంతుల్లో 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అర్ధ సెంచరీ తర్వాత మరింత మరింత రెచ్చిపోయిన రిచా ఘోష్ 46 ఓవర్లలో ఖాకా బౌలింగ్‌లో రెండు బౌండరీలు, ఇక సిక్సర్ బాదింది. భారత్ స్కోరు 251 చేరడానికి రిచా ఘోష్‌కు స్నేహ రానా అద్భుతమైన తోడ్పాటునిచ్చింది. రిచాతోపాటు రానా కూడా బంతులను బౌండరీలకు తరలిస్తూ సఫారీ బౌలర్లకు చెమటలు పట్టించింది. 42 ఓవర్‌లో మ్లాబా బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టింది. మరోవైపు రిచా ఘోష్ సెంచరీకి చేరువవుతున్న సమయంలో ప్రేక్షకులలో ఉత్కంఠ నెలకొంది. వ్యక్తిగత స్కోరు 94 పరుగుల వద్ద అవుటైన రిచాను ప్రేక్షకులు నిలబడి హర్షధ్వానాలతో అభినందనలు తెలపడం ఆకట్టుకున్నది.

లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా హాఫ్ సెంచరీతో (70) రాణించగా 81 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన దశలో బ్యాటింగ్‌కు దిగిన డీ క్లెర్క్ 54 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో (84 నాటౌట్) చెలరేగింది. 47 ఓవర్లో క్రాంతి గౌడ్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు, ఒక బౌండరీ బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. 49వ ఓవర్లో అమన్‌జోత్ కౌర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాది విజయానికి అవసరమైన 12 పరుగులను సాధించి దక్షిణాఫ్రికా జట్టుకు అనూహ్య విజయాన్నందించింది.

'విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సర్టిఫికెట్లు'

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడంలో ఎటువంటి ఇబ్బందులు లేవని సీడీసీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 'సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తిప్పలు' శీర్షికన ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఏయూ అనుబంధ కళాశాలల్లో చదువు తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. సర్టిఫికెట్ల జారీలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ఆయా కాలేజీ యాజమాన్యాలు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డీన్ యూజీ, పీజీ ఎగ్జామ్స్, డీన్ కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌ను కలిసి సర్టిఫికెట్లను తీసుకెళ్లాలన్నారు. ఒరిజినల్ డిగ్రీ, ఒరిజినల్ క్యుమిలేటివ్ మార్కుల లిస్ట్ మాత్రమే ఎగ్జామినేషన్ సెక్షన్‌లో మిగిలి ఉంటాయని, వీటి కోసం కాలేజీలు సీడీసీ నుంచి నో డ్యూస్ తీసు కుని ఎగ్జామినేషన్ విభాగంలో అందించాల న్నారు. మొదటి ఏడాదిలో చేరిన విద్యార్థులు మరో కాలేజీకి మారితే ఆ వివరాలను ఉన్నత విద్యా మండలికి తెలియజేసి రివైజ్డ్ లిస్టును తీసుకుని సీడీసీకి అందించాలన్నారు. ఆ లిస్టులోని వారికి మాత్రమే అఫిలియేషన్ ఫీజును కాలేజీల నుంచి సీడీసీ వసూలు చేస్తుందన్నారు.

7,209 మంది కళాకారులతో కూచిపూడి కళావైభవం

సీతంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భరత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 7,209 మంది కూచిపూడి కళాకారులతో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో డిసెంబరు 27న హైదరాబాద్ వేదికగా కూచిపూడి కళావైభవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు భరత్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ లలితారావు తెలిపారు. ద్వారకానగర్ గాయత్రి డిగ్రీ కళాశాల ఆవరణలో బాపు సేవా సంఘం భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 7,209 కూచిపూడి కళాకారులతో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో నిర్వహించే కళావైభవం కార్యక్రమం ప్రపంచ రికార్డు సాధిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న కూచిపూడి కళాకారులు 9515112939, 6281506722 ఫోను నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

నేత్ర సంరక్షణలో జాగ్రత్తలు తప్పనిసరి

» డాక్టర్ వి. మీనాక్షి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్.మీనాక్షి

సీతంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నేత్ర సంరక్షణ విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, కంటిలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి సూచించారు. రామాటాకీస్ రోడ్డులో గల ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో 26వ ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళ్ల సమస్యలున్నవారు ఎటువంటి చికిత్స తీసుకోవాలో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రాలను దానం చేయడం వల్ల చూపులేని వారికి చూపును ప్రసాదించిన వారు అవుతారని అన్నారు. చిన్న పిల్లలు టీవీ, సెల్‌ఫోన్ వాడడం కళ్ల మీద పడే ప్రభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసన్ జ్యోతిర్మయి, డాక్టర్ శ్రీలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

మహిళలకు మనోధైర్యం అవసరం

» డాక్టర్ మాధ్యూ, సుహాసిని డానియల్

సీతమ్మధార, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలపై జరిగే దౌర్జన్యాలను ఎదుర్కొంటూ ముందుకు సాగాలని నేషనల్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ మాధ్యూ, సుహాసిని డానియాల్ అన్నారు. సీతమ్మధారలో ఉన్న ఏఎంజీ సంస్థకి చెందిన డాక్టర్ సత్యదేవం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో గురువారం మహిళలపై జరుగుతున్న అగాయిత్యాలను ఎదుర్కొనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాధ్యూ, సుహాసిని డానియల్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలగించిన దుకాణాలు ప్రత్యక్షం

» ఆపరేషన్ లంగ్స్‌కు సవాల్ » యథా స్థానంలో బడ్డీలు ఏర్పాటు చేసి అమ్మకాలు



కొన్ని రోజుల కిందట బడ్డీలు తొలగించిన ఎంవీపీ సర్కిల్-ఉషోదయ రోడ్డులో వెలిసిన దుకాణాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగర సుందరీకరణ పేరిట చేపట్టిన ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా నగరంలోని పలు చోట్ల బడ్డీలను తొలగించిన ప్రాంతంలోనే మళ్లీ బడ్డీలు యథాతథంగా వెలిశాయి. వ్యాపారులు యథేచ్ఛగా తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఎంవీపీ కాలనీలో రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించడంతో విశాలమైన రహదారులు కనిపించాయి. దీంతో వాహనదారులు, స్థానికుల ఆనందం వ్యక్తం చేశారు. కాగా ఒక్కో ప్రాంతంలో కొన్ని చోట్ల తొలగించి, మరి కొన్ని చోట్ల తొలగింపు చేపట్టలేదు. దసరా తర్వాత వాటిని తొలగిస్తామని చెప్పినా, దసరా వెళ్లి వారం రోజులు గడుస్తున్నా, మళ్లీ ఆ ఊసే లేకపోవడంతో, తిరిగి తొలగించిన చోటే కొందరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు మళ్లీ మొదలు పెట్టారు. కొన్ని మాత్రమే తొలగించి, మరికొన్నింటి జోలికి వెళ్లకపోవడంతో కొందరికి మోదం, కొందరికి ఖేదంలా మారింది. దసర పండగ సందర్భంగా చాలా మంది వ్యాపారాలు దర్జాగా చేసుకోగా, దుకాణాల తొలగింపునకు గురైన వ్యాపారులు, అందులో పని చేసేవారూ పనుల్లేక ఇబ్బంది పడాల్సి వచ్చింది.

దీంతో తొలగించకుండా ఉన్న వారు వ్యాపారాలు చేసుకుంటుండడంతో, తొలగింపుతో ఇబ్బంది పడిన వారు మళ్లీ పాత వ్యాపారాలను పునరుద్ధరించుకునే పనిలో పడ్డారు.

కళావిహీనంగా ముడసర్లోవ పార్కు



పార్కులో సంచరిస్తున్న పశువులు

ఆరిలోవ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు నగరంలో ఆహ్లాదకర వాతావరణానికి ప్రతీకగా నిలిచిన ముడసర్లోవ పార్కు అధ్వానంగా తయారైంది. ఒకప్పుడు ఎటు చూసినా అందాలు సోయగాలు వెదజల్లిన పార్కులో సినిమా షూటింగులు జరిగేవి. నగరంలో ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా ముడసర్లోవ పార్కు బాసిల్లింది. అయితే నిర్వహణ కొరవడడంతో అంతకంతకూ ఈ పార్కు అధ్వానంగా తయారైంది. ఇప్పుడు పశువులు, గొర్రెలు వంటివి మేత మేస్తూ పార్కులో దర్శనమిస్తున్నాయి. తుప్పలు పెరిగిపోవడంతో విష సర్పాలు, పురుగులు వంటివి కూడా పెరిగాయి. పార్కు ఇంత అధ్వానంగా తయారైనా, దీని పునరుద్ధరణ గురించి ప్రజాప్రతినిధులు, అధి కారులు పట్టించుకోకపోవడంపై విమర్శలువెల్లువెత్తుతున్నాయి. పలుమార్లు ఈ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పడం తప్ప ఆచరణలో కనపించడం లేదన్న అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నగరంలోని ముఖ్య కూడలిలో ఉన్న ముడసర్లోవ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆర్టీసీ వైఎస్సార్ ఈఏ నూతన కార్యవర్గం



ఆర్ఎం అప్పలనాయుడుకు నూతన కార్యవర్గం ప్రతి అందజేస్తున్న దృశ్యం

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజనల్ కమిటీకి నూతన కార్యవర్గం ఎన్నికైంది. మద్దిలపాలెం అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన రీజనల్ స్థాయి సమావేశం ఈ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది. అధ్యక్షుడుగా బి.లక్ష్మణరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఆర్ఎల్ రాజు, చైర్మన్‌గా ఎం.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఐఆర్ వర్మ, వీవీఎస్ఎస్ రాజు, రీజనల్ కార్యదర్శిగా కేవీ బాబు, సంయుక్త కార్యదర్శులుగా జి.ప్రసాద్, పీఎస్ఎన్ ప్రసాద్, డి.రమాదేవి, కోశాధికారిగా ఎస్‌వీ మూర్తి, సహాయ కార్యదర్శులుగా బీఎల్ రాజు, యూఎస్ఆర్ లక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఏజే రావు, జీవీ లక్ష్మి ఎన్నికయ్యారు. అనంతరం వీరంతా రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి నూతన కార్యవర్గం ప్రతిని అందజేశారు.

అన్న సమారాధన

ఆరిలోవ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : దుర్గానవరాత్రుల సందర్భంగా జీవీఎంసీ 11వ వార్డులో గల కనకదుర్గా యువజన సేవా సంఘం అధ్యక్షడు పచ్చిపాల శ్రీను ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాపరుద్ర భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అంతకుముందు ఆయన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సుమారు 2500 మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మూది అప్పారావు, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, జనసేన నాయకులు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల కోసం పాల్ ప్రివెన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు

ఆరిలోవ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్యంలో అనేక శారీరక సమస్యలు ఎదురవుతాయని, వినికిడి లోపం, దృష్టి లోపం వంటి వాటిని అధిగమించేందుకు ఎల్వీపీ వైద్యశాలలో పాల్ ప్రివెన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు నేత్ర సంరక్షణ వృద్ధ విభాగాధిపతి, నేత్ర వైద్యులు డాక్టర్ అవినాష్ పతంగి తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వృద్ధులకు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. వారికి ఊతకర్రలను అందించారు. తొలుత కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

» జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

బీచ్ రోడ్డు, అక్టోబర్ 9, (ఆంధ్రజ్యోతి) : పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సీఎంఎఫ్ఆర్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సంప్రదాయ మత్స్యకారులతో వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు వేట విధానాలు, మత్స్య సంపద నాణ్యత మార్కెటింగ్ సుస్థిర వేట విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీ వీడ్ పెంపకం, కేజ్ పెంపక విదానాల ద్వారా ఉపాధి అొకాశాలు పెంచుకోవాలని సూచించారు. అనంతరం మత్స్యకారులను నీలి యోధులుగా గుర్తించి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శ్రాస్తవేత్త డా.. మీనా నిస్పాట్, శాస్త్రవేత్త డా.. మధుసూధనరావు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, మహంతి డిడి ఎంపాడా, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.



నీలి యోధులుగా గుర్తించిన మత్స్యకారులను సన్మానిస్తున్న కలెక్టర్

ఫుట్‌పాత్‌లపై చెట్ల మానులు.. వాకర్స్ ఇబ్బందులు



ఫుట్ పాత్‌పై పడి ఉన్న చెట్టు మాను

ఆరిలోవ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ రిజర్వాయర్ సమీపంలో లగల బీఆర్టీఎస్ సర్వీసు రోడ్డుకు ఆనుకొని సుమారు 9 అడుగుల మేర ఫుట్‌పాత్‌లు ఉన్నవి. ఈ మార్గంలో ఎక్కువ మంది మార్నింగ్ వాక్ చేస్తుంటారు. ఇటీవల వీచిన ఈదురు గాలులకు ఫుట్‌పాత్‌ను అనుకొని ఉన్న చెట్లు నేలకొరిగాయి. ఈ క్రమంలో.. నేల కొరిగిన చెట్లను కొందరు నరికి కొమ్మలను వంట చెరకుగా ఉపయోగించేందుకు తీసుకెళ్లగా, మానులను ఫుట్‌పాత్‌పై పడేశారు. దీంతో ఫుట్‌పాత్‌పై మార్నింగ్ వాక్ చేసే వారికి ఈ చెట్ల మానులు ఇబ్బందిగా తయారయ్యాయి.

గత వారం నుంచి ఫుట్‌పాత్‌పై నడిచేందుకు చాలా ఇబ్బందిగా ఉంటోందని పలువురు వాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం తాము వాకింగ్ చేస్తుండగా, మధ్య మానులు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని, వృద్ధాప్యంలో ఇది చాలా ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

ఈ సమస్యపై అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఉన్న చెట్ల మానుల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'సఖీ సురక్ష'తో మహిళా ఆరోగ్య పరిరక్షణ

» 26 నుంచి సురక్ష కేంద్రాల్లో వైద్య పరీక్షలు
» కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్



సఖీ సురక్ష పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరింధరప్రసాద్, పాల్గొన్న యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సరోజిని, పలువురు అధికారులు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 9, (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యానికి 'సఖీ సురక్ష రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో గురువారం మెప్మా ఆధ్వర్యంలో సఖీ సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగంగాపట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘం మహిళల ఆరోగ్యం, సామాజిక ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల ఆర్థిక పురోగతికి, వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారన్నారు విధి నిర్వహణలో నిమగ్నమై ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండడం లేదని భావించి వారి ఆరోగ్య రక్షణకు కవచంగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం నిజంగా గొప్ప విషయమన్నారు. మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ 35 ఏళ్ల దాటిన ప్రతి మహిళకు దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్ తదితర గుండె జబ్బుల ప్రమాద కారకాల వ్యాధులకు సంబంధించిన వాటిని రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 26 నుంచి సురక్ష కేంద్రాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సరోజిని తదితరులు పాల్గొన్నారు.



సఖీ సురక్ష కేంద్రంలో వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎం సత్యవేణి, పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

తుప్పు పట్టి.. తుక్కుగా మారాల్సిందేనా?

» ఏళ్ల తరబడి పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పోలీస్ స్టేషన్ల ఆవరణల్లోనే.. » ఎండావానల్లో పాడవుతున్న వెహికల్స్





పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో అస్తవ్యస్తంగా పడి ఉన్న ద్విచక్ర వాహనాలు

ఆరిలోవ, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ పాత పోలీసు స్టేషన్ వద్ద వందలాది ద్విచక్రవాహనాలు మూలకు పడి ఉన్నాయి. ఈ వాహనాలన్నీ ఎండకు ఎండి, వానకు తడిస్తూ పాడవుతున్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ఈ వాహనాలు తుక్కుగా మారాయి. ఈ వాహనాలకు ఇక్కడ తొలగించకపోవడంతో పోలీస్‌స్టేషన్ ఆవరణలో కూడా ఇబ్బందిగా ఉంటోంది.

కొన్ని చోరీ కేసులు, ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు వంటి సమయాల్లో పోలీసులు స్వాధీనం చేసుకొన్న ద్విచక్ర వాహనాలను పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచారు. ఇది కొన్నేళ్ల నుంచి సాగుతోంది. అయతే ఈ వాహనాలను ఎప్పుడూ తొలగించకపోవడం, వాహనదారులకు వాపసు ఇవ్వకపోవడం వంటి చర్యలు చేపట్టకపోవడంతో వందలాది వాహనాలు ఇక్కడ పేరుకుపోయాయి. ఎలాంటి నిర్వహణ లేని ఈ వాహనాలు తుప్పు పట్టి బాగా పాడయ్యాయి.

వర్షాలు పడినప్పుడు నీరు చేరడం, దుమ్ము, ధూళి చేరడంతో పూర్తిగా పాడైన వాహనాలు ఎన్నో ఇందులో ఉన్నాయి. ఈ వాహనాలు ఉన్న చోట పారిశుధ్య నిర్వహణ కూడా లేకపోవడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. పాములు, విష పురుగులు సంచరిస్తుంటాయి. దోమలకు నిలయంగా మారింది. దీంతో సీజనల్ వ్యాధులు కూడా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని పోలీసు సిబ్బంది, స్థానికుల ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కుప్పలుగా పడేసిన ఈ వాహనాల తరలింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆరో తరగతి విద్యార్థులకు అందని యూనిఫాం దుస్తులు

» ఉపాధ్యాయుల తప్పిదం ఫలితం
» కొత్తగా చేరిన వారి పేర్లు నమోదులో నిర్లక్ష్యం
» భీమిలి మండలంలో 174 మందికి అందని దుస్తులు



యూనిఫామ్ దుస్తులు అందకపోవడంతో సివిల్ డ్రెస్‌లలో స్కూలుకు వచ్చిన విద్యార్థులు

భీమునిపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందలేదు. కొత్తగా చేరిన విద్యార్థులకు ఉపాధ్యాయులు సరైన సమయంలో ఇండెంట్ పెట్టకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. భీమిలి అర్బన్, రూరల్ మండలాల్లో ఉన్న ఈ పాఠశాలల్లో మొత్తం 917 మంది 6వ తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి అదనంగా మరో 174 మంది చేరారు. పాఠశాల పునఃప్రారంభించి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ కొత్తగా చేరిన వారికి పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందలేదు.

దీంతో కొందరు సివిల్ దుస్తులతో వస్తుండగా మరికొందరు ప్రాథమిక పాఠశాల యూనిఫారాలతో వస్తున్నారు. మిగతా మండలాల్లోనూ ఇదే సమస్య ఉన్నా.. సీఆర్‌పీలు వారి పరిధిలోని పాఠశాలల్లో పర్యటించి ఎక్కడైనా అవసరానికి మించి పాఠ్య పుస్తకాలు ఉంటే వాటిని సేకరించి పుస్తకాలు చాలని చోట అప్పగించారు. కానీ ఇక్కడ ఆ పరిస్థితి లేదు. ఈ విషయమై ఎంఈవో -2 జయప్రద వద్ద ప్రస్తావించగా మండలంలో మొత్తం 6వ తరగతి విద్యార్థులు 1091 మంది ఉండగా పాత విద్యార్థులు 917 మంది, కొత్తగా చేరిన వారు 174 మంది ఉన్నారన్నారు.

కొత్తగా చేరిన వారికి పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు అందలేదని, ఇండెంట్ పెట్టామని చెప్పారు. ఈ సమస్య డీఈవో దృష్టిలో కూడా ఉందన్నారు.

జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఆరోగ్యశాఖలో కీలక మార్పులు

» డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఆరోగ్యశాఖలో అనేక మార్పు లు చోటు చేసుకున్నాయని, కీలక మందులు, ఆరోగ్యబీమా దరలు భారీ గా తగ్గుముఖం పట్టాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవా రం ఉదయం చిత్రాలయ థియేటర్ దగ్గరలోని జోన్-4 కార్యాలయ భవనం లో జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రైవేటు ఆస్పత్రులు, ఇన్సూరెన్స్ యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలతో అనేక రకాల మందులు ఐదు శాతం, కొన్ని అత్యవసర మందులు సున్నా జీఎస్టీ పరిధిలోకి వచ్చాయన్నారు. నూతన సంస్కరణలతో ఆరోగ్య రంగంపై కీలక మైన ప్రభావాన్ని చూపించిందన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యు లు, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్ యజ మానులు, బీమా సిబ్బంది జీఎస్టీ సంస్క రణలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

జిల్లా ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ మాట్లాడు తూ జీఎస్టీ శ్లాబుల మార్పులతో ఆరోగ్య రంగానికి సంబంధించిన అనేక ధరల్లో మార్పులు వచ్చా యన్నారు. నూతన శ్లాబులకు అనుగుణంగా కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని నిర్వహించారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 21, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 32, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 52, దొండకాయలు 32, బంగాళ దుంపలు 20 అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 72, బరబాటి 36, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 26, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ఉత్తరాంధ్రపై జగన్‌ది సవతితల్లి ప్రేమ

- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డీసీసీబీ చైర్మన్ కోనతాతారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, చిత్రంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రపై వైసీసీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని, వైసీపీ హయాంలో విద్యాభివృద్ధిని గాలికి వదిలేశారని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే సీనియర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని పేర్కొన్నారు. ఆయనలో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజల అభి వృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. తల్లికి వందనం, ప్రతినెలా పింఛన్లు, స్త్రీశక్తి పథకం విజయవంతంగా అమలు చేస్తున్నట్టు గుర్తుచేశారు. వీటితో పాటు ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ఇటీవల రూ.15 వేలను కానుకగా అందించినట్టు చెప్పారు. మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద మారుస్తున్నారని జగన్మోహన్‌రెడ్డి మొసలికన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మెడికల్ కాలేజీల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన పాపాన పోలేదన్నారు. 17 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రభుత్వం అప్పగిస్తుంది అనడంలో ఏ మాత్రం నిజం లేదన్నారు. కేంద్రం ఏడు కాలేజీలకు సిఫార్సు చేస్తే ప్రస్తుతం నాలుగు కాలేజీలు మాత్రమే ఆమోదం పొందాయని తెలిపారు. అందులోనూ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయడంతో పాటు ఆయా కళాశాలల్లోని సీట్లు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పీపీపీ పద్ధతిలో అంగీకరించిన తరువాత 33 ఏళ్ల అనంతరం ప్రభుత్వం వాటిని తిరిగి తీసుకుంటుందని చెప్పారు. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తుంటే జగన్‌రెడ్డి అర్థంలేని రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు వాటిని పట్టించుకుంటారనే నమ్మకం లేదన్నారు. ఈ సమావేశంలో డిప్యూటి మేయర్ దల్లి గోవిందరెడ్డి, జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషారాణి, ఫ్లోర్ లీడర్ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది డీవీఎస్‌కే వరప్రసాద్‌కు సత్కారం



న్యాయవాది వరప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అల్లిపురం, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డిస్ట్రిక్ అండ్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్-2 గా నియమితులైన డీవీఎస్‌కే వరప్రసాద్‌ను విశాఖ టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, ప్రభుత్వ న్యాయవాది బుగతా సత్యనారాయణ గురువారం సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమంలో న్యాయవాదులు కర్రి పార్థసారథి, ఆడారి అప్పారావు, పల్లా బాలాజీ, శివకుమార్ ఉన్నారు.

అగనంపూడిలో దోపిడీ

... 5వ పేజీ తరువాయి

దోచుకుని వెళ్లిపోయాడు. తేరుకున్న అమ్మన్న కేకలు వేయడంతో మనవడు సుమంత్ పరుగున రెండో అంతస్థుకు చేరుకునే సరికి దుండగుడు ఉడాయించాడు. అమ్మన్న కుమార్తె శ్రావణి దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. స్థానికులే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు



రాంజీ ఎస్టేట్ పాఠశాల



తరగతి గదిలో విద్యార్థులు

- జీవీఎంసీ రాంజీ ఎస్టేట్ ఉన్నత పాఠశాలలో దుస్థితి
- అప్‌గ్రేడ్ చేసిన తరువాత భర్తీ చేయని పోస్టులు
- విద్యార్థులకు అరకొరగా బోధన

కంచరపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డులో రాంజీ ఎస్టేట్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం జరగక, బోధన కుంటుపడుతోంది. దీర్ఘకాలంగా కొండవాలు గ్రామాల విద్యార్థులకు ఉన్నత పాఠశాల అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా స్థానికుల నుంచి డిమాండ్ ఉంది. అయితే మూడు నెలల క్రితం రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను అప్పర్ ప్రైమరీ పాఠశాలగా విద్యాశాఖ మార్పుచేసింది. పాఠశాలను అప్‌గ్రేడ్ చేసినా ఉపాధ్యాయుల సర్దుబాటు అంశాన్ని అధికారులు పట్టించుకోలేదు. పాఠశాలలో ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులే పనిచేస్తుండడంతో వారిపై అధిక పనిభారం పడుతోంది. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన కుంటుపడుతుండడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అసహనం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభమై నాలుగు నెలలె పూర్తి అవుతున్నా ఇంతవరకు ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు బోధించడానికి ఉపాధ్యాయులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యకత్తం చేస్తున్నారు.

కొత్త ఉపాధ్యాయులపై ఆశలు...

ఇటీవల ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన కొత్త ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు వస్తారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల్లో 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఆరు, ఏడు తరగతుల్లో 51 మంది పిల్లలు ఉన్నారు. వీరికి కనీసం సబ్జెక్టుకు ఒకరు చొప్పున ఉపాధ్యాయులు ఉండాలి. వీరి నియామకం జరగకపోవడంతో సిలబస్ పూర్తి కాలేదు. త్వరలో విధుల్లోకి చేరనున్న కొత్త ఉపాధ్యాయులను రాంజీ ఎస్టేట్ పాఠశాలకు కేటాయించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం



కార్యక్రమానికి హాజరైన సీపీ శంఖబ్రత బాగ్చి



గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న ప్రగడ వాసు

అక్కయ్యపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నగర సీపీ శంఖబ్రత బాగ్చి హాజరైయారు. ఈ మేరకు కేఎస్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు నిరాశ్రయులకు అందించిన నిత్యావసర సరకులను సీపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ తమ సోమా జ్యోతిర్గమయ ద్వారా యాచకులకు, నిరాశ్రయులకు మంచి చేసే ఉద్యమంలో ఏయూటీడీ లాంటి సంస్థలు నిర్వహిస్తున్న షెల్టర్లకు పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు దాతలు అండగా ఉండాలని కోరారు. భవిష్యత్తులో నిరాశ్రయ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామన్నారు. అనంతరం వసతి గృహానికి వచ్చిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, అకాడమీ సభ్యులు జీఎస్ఎన్ రాజు, సత్యనారాయణ చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

'సేవ్ గర్ల్ చైల్డ్' పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలో ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలలోని 'సేవ్ గర్ల్ చైల్డ్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయంతి రాధాకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాధాన్యం తెలియజేశారు. అనతరం సేవ్ గర్ల్ చైల్డ్ అంటూ నినాదాలు చేసి విద్యార్థులు ప్రదర్శన చేశారు. అలాగే విద్యార్థులు మండల స్థాయిలో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, గ్లోరీ, పీడీ రత్నం, ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం పాల్గొన్నారు.

తవ్వేస్తున్నారు... వదిలేస్తున్నారు

- ఏదో ఒక పనితో రోడ్ల తవ్వకాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పనుల కోసం రహదారులకు తవ్వుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో 26వ వార్డు చిన్నూరు మసీదుకు ఆనుకుని ఉన్న రోడ్డును మూడు నెలల క్రితం తవ్వి ఇప్పటి వరకూ ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు వచ్చి పనులు చేస్తున్నట్టు హడావుడి చేస్తున్నారు తప్పా ఏమీ చేయడం లేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి గెడ్డ ఆధునీకరణ పనులు పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని కోరుతున్నారు. ఇదే కాకుండా ఆయా ప్రాంతాల్లో కొత్తగా మంచినీటి పైప్‌లైన్ కోసమని ఒక రహదారిలో, భూగర్భ విద్యుత్ లైన్ల కోసమని మరోక దారిలో, మంచినీటి లైన్ మరమ్మతులంటూ ఇంకో దారిలో రోడ్లను తవ్వి పూడ్చకుండా విడిచిపెట్టడంతో తాము అవస్థలు పడుతున్నామని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్, తాటిచెట్లపాలెం, రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లను ఎక్కడికక్కడ తవ్వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఏదైనా పని కోసం రోడ్లను తవ్వినా తిరిగి పూడ్చేసి ప్యాచ్ వర్కులు చేసేవారు. కానీ ఈ మధ్య ఎదోక పని కోసం రోడ్లను తవ్వేస్తున్నారు. కానీ పూడ్చడంలో మాత్రం తీవ్రమైన జాప్యం చేస్తున్నారు. దీనికి తోడు వర్షాలు పడి ఆ గుంతల్లో నీరు, బురద నిలిచిపోయి రోడ్డు మొత్తం చిందరవందరగా తయారవుతోంది. కొన్ని సమయాల్లో వాహనాలు గోతుల్లో కూరుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్విన రోడ్లును పూడ్చి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నూరులో తవ్వి వదిలేసిన రోడ్డు

నడిరోడ్డుపై జగన్ షో!

... 5వ పేజీ తరువాయి

వైసీపీ నేతలకు సూచించారు. అయినప్పటికీ రోడ్డుమార్గంలో వెళతామని భీష్మించడంతో సీపీ షరతులతో అనుమతి ఇచ్చారు.

అంతటా అధికార దర్పమే...

తాము ఇంకా అధికారంలోనే ఉన్నామన్నట్టు జగన్ తన పర్యటనను కొనసాగించారు. పోలీసుల షరతులను బేఖాతరు చేస్తూ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్‌షో నిర్వహించారు. కాన్వాయ్‌లో పదికి మించి వాహనాలు ఉండకూడదని, బైక్‌లతో ర్యాలీ నిర్వహించకూడదని, అత్యవసర సర్వీసులకు ఇబ్బంది కలిగించకూడదని పోలీసులు స్పష్టంగా పేర్కొన్నారు. అయితే జగన్ పర్యటనలో అన్నింటినీ ఉల్లంఘించినా పోలీసులు కనీసం స్పందించలేదు. ఇదిలావుండగా జగన్ కాన్వాయ్ గోపాలపట్నం చేరుకునే సరికి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. అదే సమయంలో అంబులెన్స్ వచ్చినా వైసీపీ శ్రేణులు దారి ఇవ్వలేదు. ఇతర ప్రాంతాల నేతలు పెందుర్తి రాకుండా పోలీసులు అడ్డుకోవడంతో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ హడావిడి చేశారు. రోడ్డుపై బైఠాయించి అంతా తమ నియోజకవర్గ శ్రేణులేనంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిని పెందుర్తి తరలించినా పోలీసులు కిమ్మనలేదు

స్టీల్‌ప్లాంటుపై మొసలి కన్నీరు

సీఎంగా ఉన్న ఐదేళ్లు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ అంశంపై స్పందించని జగన్ ఈ పర్యటనలో మొసలికన్నీరు కార్చడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గత ఎన్నికలకు ముందు సీఎం హోదాలో జగన్ నగరానికి వచ్చి పీఎం పాలెంలో బస చేయగా స్టీల్‌ప్లాంటు కార్మిక సంఘాల నేతలు కలిశారు. ప్లాంటు నష్టాల్లో ఉన్నందున విద్యుత్ బకాయిలను మాఫీ చేయాలని కోరారు. దాంతో స్టీల్‌ప్లాంటు నష్టాల్లో ఉందా...? తెలియదే... అయినా విద్యుత్ చార్జీలు, పన్నులు కట్టమంటే ఎలా అవుతుంది చెప్పండి' అంటూ ఎదురుప్రశ్నించడంతో వారంతా అవాక్కయ్యారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను ఆపేందుకు కృషిచేయాలంటూ అదే జగన్‌కు ఇప్పుడు ఉక్కు కార్మిక సంఘాల నేతలు కాకానినగర్ వద్ద వినతిపత్రం ఇవ్వడం కొసమెరుపు. దీనికి ఆయన స్పందిస్తూ 'నేను అధికారంలో ఉన్నప్పుడు...ఇప్పుడు కూడా స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకమే' అని చెప్పడం విశేషం. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు కూర్మన్నపాలెం వద్ద సంవత్సరాల తరబడి నిరశన శిబిరం నిర్వహించారు. ఆ సమయంలో సీఎంగా ఉన్న జగన్...ఒక్కసారి కూడా శిబిరాన్ని సందర్శించిన పాపానపోలేదు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్ బదిలీ

... 5వ పేజీ తరువాయి

తీసుకువచ్చారు. భోగాపురం విమానాశ్రయాన్ని కలుపుతూ మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను పట్టాలెక్కించారు. ఇక జీవీఎంసీలో ఉండగా చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించి, పాడైన చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టారు. సుమారు ఐదు చెరువులను పునర్నిర్మించి, వాటికి నిత్యం నీరందే ఏర్పాట్లు చేశారు. విశాఖ- భీమిలి మార్గంలో పలుచోట్ల తీర ప్రాంతం కోతకు గురవుతున్న నేపథ్యంలో పరిరక్షణకు కేంద్రం విశాఖ ఎంపీ సాయంతో ఇటీవల రూ.220 కోట్ల నిధులు సాధించారు. విశాఖలో మధ్య తరగతి ప్రజల కోసం ఎంఐజీ ప్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి పనిని నిర్దిష్ట సమయంలో పూర్తిచేసేలా సిబ్బందిని సమన్వయపరిచారు.

శ్రీమతికి బదిలీతో...

విశ్వనాథన్ శ్రీమతి విశ్వాంజలి గైక్వాడ్ ఐఎఫ్ఎస్ అధికారిణి. విశాఖపట్నం రీజియన్ పాస్‌పోర్టు అధికారిగా పనిచేసేవారు. రెండు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం ఆమెను తైవాన్‌కు అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా పంపింది. మూడేళ్ల వరకు ఆమె అక్కడే ఉంటారు. ఈ నేపథ్యంలో విశ్వనాథన్ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రతించి తనను బదిలీ చేయాలని కోరారు. విశాఖ వచ్చి ఎక్కువ కాలమే అయినందున మరో శాఖలో పనిచేసే అవకాశం ఇవ్వాలని కోరడంతో ప్రభుత్వం అనుమతించి విజయవాడకు బదిలీ చేసింది.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

... 5వ పేజీ తరువాయి

అందిస్తామని ఆషా ప్రకటించింది.

పేరుకుపోయిన బకాయిలు..

జిల్లాలో మొత్తం 85 నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. వీటి లో ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రులు 65. ఈ ఆస్పత్రులకు సుమారు రూ.150 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి కనిష్ఠంగా రూ.50 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్టు ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఆరిలోవ హెల్త్‌సిటీలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి రూ.22 కోట్ల వరకు బకాయి ఉండగా, మరో ఆస్పత్రికి రూ.15 కోట్లు, ఇంకో ఆస్పత్రికి రూ.10 కోట్లు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంది. నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టమవుతోందని ఆషా ప్రతినిధులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అప్పులు చేసి మరీ సిబ్బందికి జీతాలు చెల్లించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని అసోసియేషన్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇదిలా ఉంటే నెట్‌వర్క్ ఆస్ప త్రులు సమ్మెకు దిగిన నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి నగర పరిధిలోని ఆస్ప త్రుల్లో వైద్యసేవలు పొందేందుకు వచ్చే రోగులు పునరాలోచించుకోవాలని అధి కారులు కోరుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆషా ప్రతినిధులతో చర్చలు జరుపుతోందన్నారు. కాగా అత్యవసర శస్త్ర చికిత్సల నిర్వహణలో ఆస్పత్రుల యాజమాన్యాలు అశ్రద్ధ చేస్తే చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు.

ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

జ్ఞానాపురం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్యానంతరం తెలుగు- హిందీ సాహిత్యంలో మహిళా రచయితల రచనల విశిష్టతను, సాహిత్య ప్రక్రియలో ప్రాధాన్యం వంటి అంశాలపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి రచయితల అకాడమీ అధ్యక్షుడు, లీడర్ దినపత్రిక ఎడిటర్ వీవీ.రమణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మహిళా రచయితల సాహిత్య కృషి, వారి సమకాలీన సాంఘీక సాంస్కృతిక ప్రాధాన్యంపై ప్రసంగించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధృవపత్రాలు అందజేశారు. ఈ సదస్సులో 70 మందికి పైగా వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులు, రాజభాష అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.ఎస్ కృష్ణబాబు, డాక్టర్ డీవీ.సుబ్బారావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ పీకే.జయలక్ష్మి, ప్రొఫెసర్ ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిచా ఘోష్ మెరుపు ఇన్నింగ్స్

... 5వ పేజీ తరువాయి

ఘోష్ బౌండరీలు, సిక్సర్లతో చెలరేగి స్కోరు బోర్డును పరిగెత్తించింది. ఎదుర్కొన్న తొలి బంతి నుంచి సఫారీ బౌలర్లపై దాడికి దిగింది. దక్షిణాఫ్రికా సారథి లౌరా ఎప్పటికప్పుడు బౌలర్లను మార్చినా రిచాను నిలువరించడంలో సఫలం కాలేదు. ప్రతి ఓవర్‌లో కనీసం ఒక బౌండరీ బాది భారత్ శిబిరానికి ఉత్సాహానిచ్చింది. 43.5వ ఓవర్‌లో డి క్లెర్క్ బౌలింగ్‌లో సింగిల్ తీసి 53 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో అర్ధ సెంచరీతో (50) పూర్తిచేసింది. రిచాకు స్నేహ రానా తోడైంది. ఇద్దరూ కలిసి సఫారీ బౌలర్లకు చుక్కలు చూపారు. కేవలం 36 బంతుల్లో 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అర్ధ సెంచరీ తర్వాత మరింత మరింత రెచ్చిపోయిన రిచా ఘోష్ 46 ఓవర్లలో ఖాకా బౌలింగ్‌లో రెండు బౌండరీలు, ఇక సిక్సర్ బాదింది. భారత్ స్కోరు 251 చేరడానికి రిచా ఘోష్‌కు స్నేహ రానా అద్భుతమైన తోడ్పాటునిచ్చింది. రిచాతోపాటు రానా కూడా బంతులను బౌండరీలకు తరలిస్తూ సఫారీ బౌలర్లకు చెమటలు పట్టించింది. 42 ఓవర్‌లో మ్లాబా బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టింది. మరోవైపు రిచా ఘోష్ సెంచరీకి చేరువవుతున్న సమయంలో ప్రేక్షకులలో ఉత్కంఠ నెలకొంది. వ్యక్తిగత స్కోరు 94 పరుగుల వద్ద అవుటైన రిచాను ప్రేక్షకులు నిలబడి హర్షధ్వానాలతో అభినందనలు తెలపడం ఆకట్టుకున్నది.

లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా హాఫ్ సెంచరీతో (70) రాణించగా 81 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన దశలో బ్యాటింగ్‌కు దిగిన డీ క్లెర్క్ 54 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో (84 నాటౌట్) చెలరేగింది. 47 ఓవర్లో క్రాంతి గౌడ్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు, ఒక బౌండరీ బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. 49వ ఓవర్లో అమన్‌జోత్ కౌర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాది విజయానికి అవసరమైన 12 పరుగులను సాధించి దక్షిణాఫ్రికా జట్టుకు అనూహ్య విజయాన్నందించింది.

'విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సర్టిఫికెట్లు'

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడంలో ఎటువంటి ఇబ్బందులు లేవని సీడీసీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 'సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తిప్పలు' శీర్షికన ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఏయూ అనుబంధ కళాశాలల్లో చదువు తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్నామ న్నారు. సర్టిఫికెట్ల జారీలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ఆయా కాలేజీ యాజమాన్యాలు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డీన్ యూజీ, పీజీ ఎగ్జామ్స్, డీన్ కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌ను కలిసి సర్టిఫికెట్లను తీసుకెళ్లాలన్నారు. ఒరిజినల్ డిగ్రీ, ఒరిజినల్ క్యుమిలేటివ్ మార్కుల లిస్ట్ మాత్రమే ఎగ్జామినేషన్ సెక్షన్‌లో మిగిలి ఉంటాయని, వీటి కోసం కాలేజీలు సీడీసీ నుంచి నో డ్యూస్ తీసు కుని ఎగ్జామినేషన్ విభాగంలో అందించాల న్నారు. మొదటి ఏడాదిలో చేరిన విద్యార్థులు మరో కాలేజీకి మారితే ఆ వివరాలను ఉన్నత విద్యా మండలికి తెలియజేసి రివైజ్డ్ లిస్టును తీసుకుని సీడీసీకి అందించాలన్నారు. ఆ లిస్టులోని వారికి మాత్రమే అఫిలియేషన్ ఫీజును కాలేజీల నుంచి సీడీసీ వసూలు చేస్తుందన్నారు.

7,209 మంది కళాకారులతో కూచిపూడి కళావైభవం

సీతంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భరత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 7,209 మంది కూచిపూడి కళాకారులతో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో డిసెంబరు 27న హైదరాబాద్ వేదికగా కూచిపూడి కళావైభవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు భరత్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ లలితారావు తెలిపారు. ద్వారకానగర్ గాయత్రి డిగ్రీ కళాశాల ఆవరణలో బాపు సేవా సంఘం భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 7,209 కూచిపూడి కళాకారులతో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో నిర్వహించే కళావైభవం కార్యక్రమం ప్రపంచ రికార్డు సాధిస్తుందన్నారు. ఆసక్త ఉన్న కూచిపూడి కళాకారులు 9515112939, 6281506722 ఫోను నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

నేత్ర సంరక్షణలో జాగ్రత్తలు తప్పనిసరి

- డాక్టర్ వి. మీనాక్షి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్.మీనాక్షి

సీతంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నేత్ర సంరక్షణ విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, కంటిలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి సూచించారు. రామాటాకీస్ రోడ్డులో గల ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో 26వ ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళ్ల సమస్యలున్నవారు ఎటువంటి చికిత్స తీసుకోవాలో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రాలను దానం చేయడం వల్ల చూపులేని వారికి చూపును ప్రసాదించిన వారు అవుతారని అన్నారు. చిన్న పిల్లలు టీవీ, సెల్‌ఫోన్ వాడడం కళ్ల మీద పడే ప్రభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసన్ జ్యోతిర్మయి, డాక్టర్ శ్రీలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

మహిళలకు మనోధైర్యం అవసరం

- డాక్టర్ మాధ్యూ, సుహాసిని డానియల్

సీతమ్మధార, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలపై జరిగే దౌర్జన్యాలను ఎదుర్కొంటూ ముందుకు సాగాలని నేషనల్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ మాథ్యూ, సుహాసిని డానియాల్ అన్నారు. సీతమ్మధారలో ఉన్న ఏఎంజీ సంస్థకి చెందిన డాక్టర్ సత్యదేవం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో గురువారం మహిళలపై జరుగుతున్న అగాయిత్యాలను ఎదుర్కొనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాథ్యూ, సుహాసిని డానియల్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులు 'ఉక్కు'రిబిక్కిరి

... 5వ పేజీ తరువాయి

మెటీరియల్స్ జత చేస్తారు. వాటిని ఎడిషన్లు అంటారు. ఈ ప్రక్రియను చార్జింగ్‌గా వ్యవహరిస్తారు. ఖాళీ ల్యాడిల్స్‌లోకి ఆక్సిజన్ బ్లో చేసి మరో ప్రక్రియకు సిద్ధం చేయడాన్ని కన్వర్టింగ్ ఆపరేషన్‌గా పిలుస్తారు.

నిపుణుల కొరతే కారణం

ఇప్పటివరకు నైపుణ్యం ఉన్న సీనియర్లే ఈ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఎవరు ఏ పని అయినా చేయాలని నిర్దేశించారు. ఏమైనా పొరపాట్లు జరిగితే అది ప్రాణాలతో చెలగాటమే. అవగాహన రాహిత్యంతోనే అధికారులు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. వీఆర్ఎస్ పేరుతో సుమారుగా 1,800 మందిని ఇంటికి పంపించేసి, వారు చేసిన పనులన్నీ ఇతరులు పంచుకోవాలని ఆదేశిస్తూ పనిభారం మోపుతున్నారని, పనిగంటలు పెంచేశారని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.553.22 కోట్లు

... 5వ పేజీ తరువాయి

వరకు) రూ.681.77 కోట్ల ఆదాయం సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అధికారులు రియల్ ఎస్టేట్ సంస్థలతో సంప్రతింపులు చేసి, ఒప్పందాలన్నింటినీ రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకుని రూ.553.22 కోట్ల ఆదాయం లభించేలా చూశారు. ఇది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో 81.15 శాతం. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రూ.497.22 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. దాంతో పోల్చుకుంటే ఈ ఏడాది 11.26 శాతం వృద్ధి నమోదైందని విశాఖ డీఐజీ బాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్టు



నిందితుడితో సీఐ దివాకర్, తదితరులు

మహారాణిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రేప్ కేసులో రెండేళ్లగా కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని మహారాణిపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన పదార్తి వీరేంద్ర అలియాస్ చెర్రీ అనే వ్యక్తిని 2017లో రేప్ కేసులో మహారాణిపేట పోలీసులు అరెస్టు చేశారు. బెయిల్ వచ్చిన వీరేంద్ర కోర్టుకు హాజరుకాకుండా రెండేళ్లగా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ రెండేళ్ల పోలీసులకు దొరకకుండా ఉండేందుకు వీరేంద్ర కనీసం మొబైల్ ఫోన్ కూడా వినియోగించలేదు. దీంతో నిందితుడిపై కోర్టు నాన్‌బెయిల్‌బుల్ వారెంటును జారీ చేసింది. సీఐ దివాకర్‌కు వచ్చిన సమాచారం ప్రకారం వీరేంద్రను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.

'అంబుజా'పై పోరుకు సన్నాహాలు!

» పెదగంట్యాడలో సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకుంటామంటున్న బాధిత ప్రాంతాల ప్రజలు

» ప్రజాప్రతినిధులు సహకారంతో ముందుకు సాగేందుకు వ్యూహరచన



పెదగంట్యాడ ఉక్కు నిర్వాసితుల కాలనీలోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ వేదికను తొలగిస్తున్న ఆందోళనకారులు (ఫైల్)

గాజువాక, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడలో అంబుజా సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న అన్ని వర్గాల ప్రజలు భవిష్యత్తులో ఐక్యంగా ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు. సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటులో భాగంగా బుధవారం పెదగంట్యాడ ప్రాంతంలో అధికారులు నిర్వహించ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రజాగ్రహంతో తాత్కాలికంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మరో పదిహేను రోజుల్లో ప్రజాభిప్రాయ సేకరణను చేపడతామని అధికారులు ప్రకటించడం, ప్రజా వేదికలో ప్రజలంతా తమ అభిప్రాయాలను వెల్లడించుకోవాలని చెప్పడంతో.. రానున్న రోజుల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై గంగవరం నుంచి అగనంపూడి ప్రాంతం వరకు, గాజువాక పారిశ్రామిక ప్రాంతాల ప్రజలంతా గ్రామాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించుకుని పెదగంట్యాడలో సిమెంటు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయరాదంటూ సంతకాల సేకరణకు సిద్ధపడుతున్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ కమిటీలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో అంబుజా సిమ్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు సమాలోచనలు చేస్తున్నారు.

వాస్తవానికి ఇప్పటికే గంగవరం పోర్టు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పారిశ్రామిక ప్రాంత ప్రజలు పెదగంట్యాడలో సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్న ప్రకటన వెలువడినప్పటి నుంచి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆదినుంచి కూడా ఈ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటామని స్థానిక ప్రజాసంఘాల ప్రతినిధులు హెచ్చరిస్తూ వస్తున్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులను కలిసి వారి మద్దతు కోరతామని, వారి నేతృత్వంలో కాలుష్య భరితమైన సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పలువురు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా చిన్న చిన్న గ్రామ సభలను నిర్వహించి ప్రజలను మరింత చైతన్యవంతుల్ని చేసేందుకు, ఆ తరువాత భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు అంబుజా సిమెంటు ఫ్యాక్టరీ బాధిత గ్రామాల ప్రజలు సన్నాహాలు చేస్తున్నారు.



తహసీల్దార్ వెంకట అప్పారావుతో సమావేశమైన పీవోడబ్ల్యు ప్రతినిధి లక్ష్మి, తదితరులు

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు చర్య వివాదాస్పదం

» తహశీల్దార్ కార్యాలయ ముట్టడికి పీవోడబ్ల్యూ ప్రతినిధులు, కాలనీవాసుల యత్నం



అంబేడ్కర్ విగ్రహం

పెందుర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడ సమీప అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం రాత్రి రెవెన్యూ, జీవీఎంసీ సిబ్బంది తొలగించేందుకు యత్నించడం వివాదస్పదంగా మారింది. రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ పీవోడబ్ల్యూ ప్రతినిధులు, కాలనీవాసులు తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. రాత్రిపూట రెవెన్యూ సిబ్బంది మాస్కులు వేసుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలనుకోవడంలో అంతర్యం ఏమిటో తహశీల్దార్ సమాధానం చెప్పాలని నినదించారు. వివరాలిల్లోకి వెళితే..

అంబేడ్కర్ నగర్ కాలనీ సమీపంలో గల అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం రాత్రి మాస్కులు ధరించి వచ్చిన సిబ్బంది గునపాలతో తొలగించేందుకు యత్నించారు. ఈ విషయం తెలిసిన అంబేడ్కర్‌నగర్, ఏకలవ్య కాలనీవాసులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విగ్రహం తొలగింపు చర్యలను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నోటీసులు ఇవ్వకుండా విగ్రహాన్ని ఎలా తొలిగిస్తారని వారిని నిలదీయడంతో తహశీల్దార్ కార్యాలయానికి వస్తే ఆర్డీవో, తహశీల్దార్ సమాధానం ఇస్తారని వారు తెలపడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో సిబ్బంది వెనుదిరిగారు. అనంతరం పీవోడబ్ల్యూ ప్రతినిధులు లక్ష్మి, ఇందిర, కాలనీవాసులు తహశీల్దార్ కార్యాలయ ముట్టడికి యత్నించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఎందుకు తొలగించానుకున్నారో ఆర్డీవో, తహశీల్దార్ సమాధానం చెప్పేదాక కదిలేది లేదని భీష్మించారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కార్యాలయంలోనే ఉన్న తహశీల్దార్ వెంకట అప్పారావు తమకు వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో అక్కడి వాతావరణం వేడెక్కడంతో వారిని కార్యాలయంలోకి అనుమతిచ్చారు. తహశీల్దార్ వెంకట అప్పారావు వారితో సమావేశమై.. విగ్రహం తొలగింపుపై విచారణ చేపడతామని హామీ ఇచ్చినా వారు సంతృప్తి చెందలేదు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ ప్రతినిధులు, లక్ష్మి, ఇందిరలు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని రాత్రిపూట తొలగించాలనుకోవడం దారుణమన్నారు. ఇందుకు సంబంధించి ఆర్డీవో, తహశీల్దార్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అక్కడ నుంచి స్టేషన్‌కు తరలివెళ్లారు.

టిడ్కో ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అందజేస్తాం

» పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

» రుణాలు మంజూరయ్యేలా చూస్తాం: డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న గణబాబు, కోన తాతారావు, తదితరులు

మల్కాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని, త్వరలోనే వాటిని లబ్ధిదారులకు అందించే అందించే దిశగా అడుగులు వేస్తున్నారని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల్లో చాలామందికి రుణాల మంజూరుకు సమస్యలు నెలకొన్న నేపథ్యంలో వాటిని డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు దృష్టికి నేరుగా తీసుకువెళ్లేందుకు గాను గురువారం ఆయనతో పాటు గణబాబు ములగాడ, మల్కాపురం శివారు అచ్చినాయుడు తోట ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా సంక్షోభంలో ఉన్నప్పటికీ చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు గాడిలో పెడతున్నారన్నారు. కోన తాతారావు మాట్లాడుతూ అనేక మంది లబ్ధిదారులకు పలు కారణాల వల్ల బ్యాంకు రుణాలు మంజూరవ్వడం లేదని, ఆ ఇబ్బందులను తొలగించి అందరికీ రుణాలు మంజూరయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జోన్-5 కమిషనర్ రాము, టిడ్కో హౌసింగ్ సూపరింటెండెంట్ నరసింహమూర్తి, హౌసింగ్ డీఈ శ్రీహరి, ఈఈ సుధాకర్, ఏపీడీ చిరంజీవి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పద్మనాభనగర్‌లో..

గోపాలపట్నం: ఇక్కడి పద్మనాభనగర్‌లో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే పి.గణబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల నిర్మాణం టీడీపీ ప్రభుత్వం చేపడితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రంగులు వేసి ప్రజాధనాన్ని వృథా చేసిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు కృషితో టిడ్కో ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతు న్నాయని, త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ పర్యటనలో డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, జడ్సీ శంకరరావు, టిడ్కో హౌసింగ్ సూపరిటెండెంట్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణికి ప్రొటీన్ పౌడర్, ఐరన్ టానిక్‌ను అందజేస్తున్న డాక్టర్ గోపీకృష్ణ

గర్భిణులకు ప్రొటీన్ పౌడర్, టానిక్‌ల పంపిణీ

అగనంపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ సూచించారు. విశాఖ సౌత్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వంద మంది గర్భిణులకు ప్రొటీన్ పౌడర్, ఐరన్ టానిక్‌లను అయ న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యం కోసం రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు వి.శివకుమార్‌రెడ్డి, వై.నాయుడు, ఉమామహేశ్వరరెడ్డి, మార్కండేయులు, మహేశ్వరరెడ్డి, నితీశ్, శ్రీనివాసరావు, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

హ్యాక్‌థాన్ పోటీల్లో విజ్ఞాన్ విద్యార్థులకు బహుమతులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థి

అగనంపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాగ్నిజెంట్, ఆస్టన్ మార్టిన్ సంస్థలు సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన హ్యాక్‌థాన్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. ఇంజనీరింగ్ ఫైనలి యర్ విద్యార్థి జతిన్ ప్రథమ స్థానంలో నిలవగా, మూడో సంవత్సర విద్యార్థినులు హారిక, లోహిత ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్ సుధాకర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కాగ్నిజెంట్, ఆస్టన్ మార్టిన్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన హ్యాక్‌థాన్ పోటీల్లో బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ మధుసూదనరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



పెందుర్తిలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం జగన్

పెందుర్తిలో వైఎస్ జగన్ పర్యటన

పెందుర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, కూడళ్ల వద్ద జగన్‌కు స్వాగతం పలికేందుకు వైసీపీ కార్యకర్తలు తరలిరావడంతో రద్దీ నెలకొంది. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు, వైసీపీ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు, నాయకులు గొర్లె రామునాయుడు, గండి రవికుమార్, పైలా శ్రీనివాసరావు, కోడిగుడ్ల దేవిసాంబ, తదితరులు పెందుర్తిలో జగన్ కోసం నిరీక్షించారు. వైసీపీ శ్రేణులు రోడ్డుపైకి రావడంతో సీఐ కేవీ సతీశ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు అడ్డుకోవడంతో చిన్నపాటి వాగ్వాదాలు జరిగాయి. కాగా ఒంటిగంట సమయంలో పెందుర్తి కూడలికి జగన్ చేరుకుని కారుపై నుంచే అందరికీ అభివాదం చేశారు. జగన్‌కు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జగన్ కాన్వాయ్ నర్సీపట్నం వెళ్లింది.

రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

జగన్ రోడ్ షోలో భాగంగా ఇతర జిల్లాల నుంచి పలువురు పెందుర్తి చేరుకుంటున్నారని, పోలీసుల ఆంక్షలను బేఖాతారు చేస్తున్నారని సీఐ సతీశ్‌కుమార్, సిబ్బంది స్థానిక చిన్నమిల్లు వద్ద పలువురిని నిలువరించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అక్కడకు చేరుకుని తమ కార్యకర్తలను అడ్డుకోవడం సరికాదంటూ రోడ్డుపై బైఠాయించారు. కాగా అక్కడకు వచ్చినవారు సబ్బవరం ప్రాంతానికి చెందినవారని పార్టీ శ్రేణులు చెప్పడంతో అదీప్‌రాజ్ ఆందోళన విరమించారు.

జగన్‌కు ఉక్కు పోరాట కమిటీ నాయకుల వినతి

ఎన్.ఎ.డి.జంక్షన్: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు కాకానీనగర్ కూడలిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూడాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకునేందుకు కృషి చేయాలని, ఈవోపిలను ఉపసహించుకునేలా చూడాలని వేడుకున్నారు. జగన్‌ను కలిసిన వారిలో నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, డీవీ రమణారెడ్డి, తదితరులు ఉన్నారు. కాగా జగన్ ఎన్ఏడీ కూడలి, బాజీ జంక్షన్, వేపగుంట, పురుషోత్తపురం జంక్షన్లలో కార్యకర్తలకు అభివాదం చేశారు. పురుషోత్తపురంలో కార్యకర్త రాము కుమార్తెను కాసేపు ఎత్తుకుని ముద్దాడారు.



సమస్యను ఎమ్మెల్యే గణబాబుకు, అధికారులకు వివరిస్తున్న బాధితుడు

దీర్ఘకాలిక భూ సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష

ఆర్పీపేట (కంచరపాలెం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి రామ్మూర్తి పంతులపేట, గవరకంచరపాలెం గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలపై పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు గురువారం రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ రెండు గ్రామాల ప్రజలతో నిర్వహించిన సమావేశంలో గోపాలపట్నం, మహారాణిపేట తహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్యం రాక ముందు నుంచి ఆర్పీపేట, గవరకంచరపాలెం గ్రామాలు ఉన్నాయని, గతంలో రైల్వే ట్రాక్స్ నిర్మాణం కోసం పలువురు భూమిని అందించారన్నారు. అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసిన సర్వే నంబర్లు, గ్రామాల పేర్లకు.. ప్రస్తుతం ఉన్న పేర్లకు వ్యత్యాసం ఉన్నందున పలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. అప్పట్లో ఈ రెండు గ్రామాల్లోని స్థలాలు టౌన్ వార్డు, గోపాలపట్నం తదితర గ్రామాల పేర్లతో ఉన్నాయన్నారు. అందువల్ల ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా రెండు మండలాల తహశీల్దార్లు, సిబ్బంది చూడాలని సూచించారు. సమావేశంలో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ నిర్వాసిత నిరుద్యోగులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉక్కు నిర్వాసిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులు గురువారం టౌన్‌షిప్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోవడం దారుణమ న్నారు. ఇటీవల నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను కూడా యాజమాన్యం తొలగించిందన్నారు. నిర్వాసితుల సమస్యలపై ప్రజాప్రతినిధులు కల్పించుకుని న్యాయం జరిగేలా చూడాలని కోరారు. నిర్వాసితులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పీతన భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, సోంబాబు, అప్పలరెడ్డి, వెంకటేశ్, చిన్న, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ అన్నారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లాంటును ప్రైవేటీకరించబోమని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటించాలన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



సిద్ధార్థనగర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన పల్లా శ్రీనివాసరావు

87వ వార్డును స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతా

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డును స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్‌లో 4 ఎకరాల 50 సెంట్ల స్థలంలో గురువారం రూ.కోటి 55 లక్షలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులకు ఆయన కార్పొరేటర్ బొండా జగన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రహరీ, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటల పరికరాలు, ఓపెన్ జిమ్ వంటి వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. బొండా జగన్ మాట్లాడుతూ 14 నెలల్లో రూ.25 కోట్ల అభివృద్ధి పనులు వార్డులో చేపట్టడం జరిగిందన్నారు. ఇదంతా ఎమ్మెల్యే పల్లా శ్రీనివారావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, గ్రేటర్ కలెక్టర్, కమిషనర్‌ల ప్రోత్సాహం వల్లే సాధ్యపడిందన్నారు. 87వ వార్డును స్మార్ట్ వార్డుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, బొట్టా ప్రకాశ్, లక్కరాజు సోంబాబు, బొండా ఎల్లాజీ, సూరిశెట్టి పెంటారావు, రాజన్ రాజు, డీవీ అప్పారావు, ఎం.రాము, రాంబాబు, దానయ్య, కె.శ్రీనివాసనాయుడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగన్ గో బ్యాక్ అంటూ నిరుద్యోగుల జేఏసీ నాయకుల నిరసన



ప్లకార్డుతో జేఏసీ నేత హేమంత్‌కుమార్

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జగన్ పర్యటనలో పటిష్ఠ ఆంక్షలు ఉన్నప్పటికీ నిరుద్యోగుల జేఏసీ నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 20 మంది జగన్ గో బ్యాక్, ఏ ముఖం పెట్టుకుని విశాఖ వచ్చారు, నిరుద్యోగులను మోసం చేసిన ఘనుడు వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులను వారు ప్రదర్శించారు. ఈ క్రమంలో హేమంత ఎన్ఏడీ నుంచి బుచ్చిరాజుపాలెం వెళ్లే మార్గంలోని ఓ అపార్టుమెంట్‌పైకి వెళ్లి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సనపల తిరుపతిరావు, రాజుబాబు, నరసింగరావు, రాంబాబు, రమేశ్, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అందరికీ మేలు

పలుచోట్ల అవగాహన ర్యాలీల నిర్వహణ

కూర్మన్నపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో గురువారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. మిగుల సొమ్ము పొదుపు, పెట్టుబడిగా మారితే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, నాయకులు బొట్టా ప్రకాశ్, డీవీ అప్పారావు, ప్రగడ దానయ్య, మాటూరి రాము, కె.శ్రీను, రాజన్‌రాజు, పద్మ, భాను, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సింధియా: పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు 62వ వార్డు త్రినాథపురం, దుర్గానగర్, తదితర ప్రాంతాల్లో జీఎస్టీ తగ్గింపుపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సీవో మూర్తి, సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి శివరామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఆర్‌పీలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర ప్రభుత్వం అనేక వస్తువులపై జీఎస్టీని తగ్గించడం, మరికొన్నింటిని రద్దు చేసి ప్రజలకు ఎంతో మేలు చేసిందని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన జీఎస్టీ అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. జీఎస్టీపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు మహ్మద్ ఇస్మాయిల్, రవిచంద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు 'సఖీ సురక్ష'

జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి. చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యానికి 'సఖీ సురక్ష'ను రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో గురువారం మెప్మా ఆధ్వర్యంలో సఖీ సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగంగా పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘం మహిళల ఆరోగ్యం, సామాజిక ఆర్థిక శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మహిళల ఆర్థిక పురోగతికి, వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణను చేపడుతున్నారన్నారు విధి నిర్వహణలో నిమగ్నమై ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండడం లేదని భావించి వారి ఆరోగ్య రక్షణకు కవచంగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం నిజంగా గొప్ప విషయమన్నారు. మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె జబ్బుల ప్రమాద కారకాల వ్యాధులకు సంబంధించిన వాటికి రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 26 నుంచి సురక్ష కేంద్రాల్లో ఆరోగ్య పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

'అంబుజా సిమెంటు ఫ్యాక్టరీ ప్రతిపాదనలను విరమించుకోవాలి'

పెదగంట్యాడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడలో అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని ఏపీఐఐసీ డైరెక్టర్, టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ఈ ప్రాంత ప్రజల అభిప్రాయాలను, మనోభావాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని గంగవరం పోర్టులోని రూ.7,000కోట్ల విలువైన ప్రభుత్వ వాటాను రూ.600 కోట్లకే అదానీ సంస్థకు కట్టబెట్టారని, దీంతో పోర్టు యాజమాన్యం ఈ ప్రాంత ప్రజల హక్కులను కాలరాస్తుందని పేర్కొన్నారు.

భెల్ హెచ్‌పీవీపీ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడమంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనని భెల్ హెచ్‌పీవీపీ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి జీటీటీ ప్రకాశ్ అన్నారు. సీజేఐపై దాడి యత్నాన్ని నిరసిస్తూ గురువారం భెల్ హెచ్‌పీవీపీ ప్రధానగేటు ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సీతంనాయుడు, సీహెచ్ మురళీశ్వరరావు, కె.నారపురెడ్డి, డి.నరసింహరావు, విజయ్‌కుమార్, జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవితకు మార్గనిర్దేశం ఎన్‌సీసీ

పెందుర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఎన్‌సీసీ మార్గనిర్దేశం చేస్తుందని లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణ ప్రభాత్ పేర్కొన్నారు. పెందుర్తిలోని పీఎంశ్రీ పాఠశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరైన నేపథ్యంలో గురువారం లెఫ్టినెంట్ కల్నల్స్ స్వర్ణ ప్రభాత్, నీరజ్‌కుమార్‌లు ఈ స్కూల్‌ను సందర్శించారు. బెటాలియన్ బృందం విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం చిన్నమ్మాయి, ఎన్‌సీసీ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 20, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 44, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270


మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరు దేశాల జాతీయ గీతాలను ఆలపిస్తున్న మహిళా క్రికెటర్లు


స్మృతి మంధాన బ్యాటింగ్

క్రికెట్ జోష్

మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో గురువారం భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠ భరితంగా జరిగింది. ప్రేక్షకుల హర్షధ్వానాలతో స్టేడియం మార్మోగింది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి




భారత్, దక్షిణాఫ్రికా కెప్టెన్లు హర్మన్ ప్రీత్ కౌర్, లారా వోల్వార్ట్


స్టేడియంలో జాతీయ జెండాలతో అభిమానుల సందడి



వికెట్ తీసిన ఆనందంలో దక్షిణాఫ్రికా మహిళా క్రికెటర్లు

తీరని వేదన

- ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న మానసిక సమస్యలు
- ప్రకృతి విపత్తులు, యుద్ధాలు వంటి పరిస్థితులే కారణం
- సమస్యలపై ప్రజల్లో అవగాహన అవసరం
- సకాలంలో గుర్తిస్తే సాంత్వన చేకూర్చే అవకాశం
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

మానసిక సమస్యల బారినపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ఇంట్లో ఇబ్బందులు, కుటుంబ పర మైన, ఆర్థిక ఇబ్బందులు మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. ఈ తరహా సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు పదో తేదీన వరల్డ్ మెంటల్ హెల్త్ డే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యం అందుబాటులో ఉంచడం థీమ్‌తో వారోత్సవాలను నిర్వహించనున్నారు.



ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న విపత్కర పరిస్థితులు అనేకమందిలో మానసిక సమస్యలకు కారణమవుతున్నట్టు వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ గుర్తించింది. వివిధ దేశాల మధ్య యుద్ధాలు, కరోనా వ్యాప్తి, ప్రకృతి విపత్తులు తీవ్రమైన కుంగుబాటుకు గురిచేస్తున్నాయంటున్నారు. గత పదేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా యుద్ధం, ఇతర విపత్తుల వల్ల సంఘర్షణను అనుభవించిన ప్రతి ఐదుగురిలో ఒకరు నిరాశ, ఆందోళన, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్, బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రీనియా వంటి మానసిక సమస్యలకు గురయినట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ తరహా అత్యవసర పరిస్థితు లు నెలకొన్న ప్రాంతాల్లో మానసిక వైద్య సేవలను అందించడం కూడా ఇబ్బందిగా మారుతోందంటున్నారు.

భరోసా కల్పించేలా చర్యలు

విపత్తులు, ఇతర అత్యవసర పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లోని ప్రజలకు భరోసాను ఇవ్వడం కీలకమని చెబుతున్నారు. విపత్తులు, అత్యవసర పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లోని ప్రజలతో కలిసి పనిచేసేందుకు ప్రజలు ముందుకురావాలి. బాధితులకు మానసిక, శారీరక ఆరోగ్య సేవలను అందించాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు సహకరించాలి. ముఖ్యంగా పిల్లల్లో ఈ తరహా ఒత్తిడి అధికంగా ఉంటుంది. దానిని గుర్తించి బయటప డేలా కౌన్సెలింగ్, మందులను అందించి సాధారణ స్థితికి తీసుకురావాలి.

భయాందోళనలే కారణం



ప్రకృతి విపత్తులు, యుద్ధాలు వంటివి ఎంతో మందిపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటాయి. ఎప్పుడు ఏం జరుగు తుందన్న ఆందోళనతో డిప్రెషన్, పోస్టు ట్రామాటిక్ స్ట్రెస్ బారినపడుతున్న వారి సంఖ్య పెరిగింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో వరదల వల్ల ఎంతోమంది ప్రాణాలను కోల్పోయారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు కొన్ని రోజులపాటు మానసికంగా కుంగుబాటుకు గురయ్యారు. ఈ తరహా సమస్యలతో బాధపడుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చాం. వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు, సింపోజియం నిర్వహిస్తున్నాం.

- డాక్టర్ ఎంవీఆర్ రాజు, సైకాలజీ విభాగాధిపతి

కురుపాం మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలి

ఆస్పత్రిలో చేరినవారికి రూ.లక్ష ఇవ్వాలి: వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

మహరాణిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కురుపాం గురుకుల ఆశ్రమ పాఠశాలలో ఆర్వో ప్లాంటు పనిచేయక కలుషిత నీరు తాగి 170 మంది విద్యార్థినులు పచ్చకామెర్లతో ఆస్పత్రుల్లో చేరాల్సి వచ్చిందని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను గురువారం రాత్రి ఆయన పరామర్శించారు. అనంతరం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కామెర్లతో ఇద్దరు పిల్లలు మృతి చెందారని, వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చేరిన ప్రతి ఒక్కరికీ రూ.లక్షచొప్పున ఇవ్వాలన్నారు. ప్రభుత్వం పిల్లలను పట్టించుకోకపోతే వారి తరఫున కేసు పెట్టి నష్టపరిహారం ఇచ్చేలా కోర్టు తలుపు తడతామన్నారు. మృతిచెందిన చిన్నారుల కుటుంబాలకు పార్టీ తరఫున రూ.ఐదు లక్షలు సాయం అందజేస్తామన్నారు. పిల్లలకు ఇచ్చే తాగునీరు కలుషితమవడంతోనే కామెర్లు వచ్చినట్టు వైద్యులు చెబుతున్నారన్నారు. మినరల్ వాటర్ ప్లాంటు పనిచేసి ఉంటే నీరు ఎందుకు కలుషితమవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు, మంత్రులు అసలు విషయాన్ని దాచి పెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. ఒకేస్కూల్ నుంచి 65 మంది విద్యార్థులు ఆరోగ్యం బాగాలేక 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రికి రావాల్సి వచ్చిందని, పార్వతీపురంలో ఆస్పత్రిని కట్టి ఉంటే ఈ అవసరం ఉండేది కాదన్నారు.


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

భూ సేకరణ పనులు సత్వరం పూర్తిచేయండి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టనున్న మెట్రోరైలు, రైల్వే విస్తరణ, ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ, ఇతర పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పనులు పురోగతిని తెలుసుకున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి అన్ని రకాల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాల పరిష్కారంలో అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేశారు. నిర్ణీత కాలపరిమితిలో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీ శంకర్, విశాఖ,భీమిలి ఆర్డీవోలు పి.శ్రీలేఖ,సంగీత్ మాధుర్, ప్రత్యేక ఉప కలెక్టర్ సుధాసాగర్, మెట్రో ప్రాజెక్టు, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, ఈపీడీసీఎల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ఇళ్లకు తలుపులు బిగించాల్సిందే

- హౌసింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):

నగర శివారు ప్రాంత లేఅవుట్‌లలోని సెంటు భూమిలో నిర్మిస్తున్న ఇళ్లకు తలుపులు బిగించాల్సిందేనని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ గృహనిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. ఇళ్లకు తలుపులు బిగించకుండా కొందరు కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారులు కుమ్మక్కైన అంశంపై 'గూడు పుఠాణి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. గృహనిర్మాణ సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించి తలుపులు బిగించడంలో ఇబ్బందులు ఏమిటని నిలదీశారు. కాంట్రాక్టర్లతో కుదుర్చుకున్న ఒప్పందంలో తలుపు ఏర్పాటు లేదని తప్పుడు అగ్రిమెంట్ కాపీని కలెక్టర్‌కు చూపించే ప్రయత్నం చేయడంతో ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కొంతమంది కాంట్రాక్టర్లు తాము నిర్మించిన ఇళ్లకు తలుపులు బిగించిన విషయాన్ని గుర్తుచేశారు. నిర్మించిన ప్రతి ఇంటికీ తలుపులు బిగించిన తరువాతే మొత్తం బిల్లులు చెల్లించాలని స్పష్టంచేశారు.

గోపాలపట్నంలో యువకుడి హల్‌చల్

- డీ మార్ట్ భవనంపైకి ఎక్కి దూకేస్తానని బెదిరింపు
- అరెస్టు నుంచి తప్పించుకునే యత్నం
- రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన పోలీసులు

గోపాలపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ కేసులో నిందితుడైన యువకుడు పోలీసుల నుంచి తప్పించుకుకోడానికి భవనంపైకి ఎక్కి కిందకు దూకేస్తానని బెదిరించాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి అతడిని క్షేమంగా కిందకు దించి స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన గోపాలపట్నంలో చోటు చేసుకుంది.

గాజువాకకి చెందిన వడ్డాది కృష్ణ ఓ కేసులో నిందితుడు. ఇతడు గోపాలపట్నం వద్ద ఉన్నట్టు సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు అతడిని పట్టుకునేందుకు గురువారం సాయంత్రం 5 గంటలకు వచ్చారు. పోలీసులనుంచి తప్పించుకునేందుకు కృష్ణ స్థానిక బంకు కూడలి సమీపంలోని డీ మార్ట్ భవనంపైకి ఎక్కాడు. మద్యం మత్తులో భవనంపై నుంచి దూకేస్తానని బెదిరించాడు. సమాచారం అందుకున్న గోపాలపట్నం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి అతడిని క్షేమంగా కిందకు దించారు. అనంతరం గాజువాక పోలీసులకు అప్పగించారు.


డీమార్ట్ భవనంపై యువకుడు


రెస్క్యూ ఆపరేషన్‌లో పోలీసులు, ఫైర్ సిబ్బంది

క్రైం... crime news

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


రాజేష్ (ఫైల్ ఫొటో)

సీతంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భార్యతో మనస్పర్థల కారణంగా ఓ వ్యక్తి మనస్తాపానికి గురై చాకుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటిచెట్లపాలెం రామచంద్రపురం రాజీవ్ గృహకల్పలో ఉంటున్న గడ్డి రాజేష్ (43) లారీ యజమాని. అతడి భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నాడు, ఇతడికి మద్యం సేవించే అలవాటు ఉంది. తాగి వచ్చినప్పుడు భార్య లక్ష్మితో గొడవపడుతుంటాడు. దీంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో లక్ష్మి కుమారుడితో సహా దసరాకు ఆనందపురం మండలం కుపిలివాడ వెళ్లింది. పండగ తర్వాత కూడా ఆమె తిరిగి రాలేదు. భార్య ఫోన్ కూడా చేయకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేష్ పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. బాతూరూమ్‌కి వెళ్లి కత్తితో గొంతు కోసుకున్నాడు. రాజేష్ తల్లి కోడలికి, పోలీసులకు సమాచారం ఇచ్చింది. సీఐ ఉమాకాంత్, ఎస్ఐ చిన్నంనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

మానసిక పరిస్థితి సరిగా లేక...

పెందుర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పాటు ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతపెందుర్తిలో ఉంటున్న రామకృష్ణ (34), పనిలేక ఇంటి వద్దే ఉంటున్నాడు. భార్య మానస అగరుబత్తీలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. భర్తకు వైద్యం చేయించేందుకు బంగారు ఆభరణాలను విక్రయించేందుకు అనకాపల్లి వెళ్లింది. తిరిగి వచ్చి పిలిచినా భర్త తలుపులు తెరవకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టి వెళ్లి చూడగా రామకృష్ణ సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించాడు. హెచ్‌సీ రమణ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డిపోపై కేసు నమోదు


రేషన్ డిపో తనిఖీ చేస్తున్న ఆర్డీవో సంగీత్ మాథుర్

సీతంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార మండలంలోని కొన్ని రేషన్ డిపోలను భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ గురువారం తనిఖీ చేశారు. డిపో నంబరు 210 తనిఖీ చేసే సమయంలో స్టాక్ రిజిస్టర్ కంటే 750 కిలోల బియ్యం తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. దీంతో డిపోను సీజ్‌చేసి డీలరుపై కేసు నమోదుచేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం అదే ప్రాంతంలో మరో డిపోను తనిఖీచేశారు. అక్కడకు దూరంగా ఉన్న డిపోలో బియ్యం లేకపోవడంతో వచ్చామని కార్డుదారులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన పౌరసరఫరాల సంస్థ అధికారులకు ఫోన్‌చేస్తే బియ్యం సరఫరాలో ఇబ్బందులున్నాయని నివేదించారు. ఆర్డీవో వెంట హెచ్‌డీటీ ఎస్. త్రినాథరావు, సివిల్ సప్లైస్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ మణికంఠ ఉన్నారు.